PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 93 | విజయవాడ, మంగళవారం 5 నవంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 5 November 2024 | Rs

క్రికెట్‌కు వృద్ధిమాన్ సాహా గుడ్‌బై

6

ఉభయ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

ఉప ఎన్నిక డిసెంబరు 5న

- ఈ నెల 11న నోటిఫికేషన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తూర్పుగోదావరి - పశ్చిమగోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో ఉప ఎన్నిక డిసెంబర్ 5న నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. 2021లో ఈ స్థానం నుంచి ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) తరపున గెలిచిన యుటిఎఫ్ నేత షేక్ సాబ్జీ గతేడాది డిసెంబరు 15న రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక అవసరమైంది. ఈ నెల 11న నోటిఫికేషన్ విడుదలవుతుంది. 18 వరకు నామినేషన్ల దాఖలుకు గడువు కాగా, 19న నామినేషన్ల పరిశీలన చేపడతారు. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు 21. డిసెంబరు 5న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. డిసెంబరు 9న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నట్లు ఇసి తెలిపింది.

మరో 'సర్దుపోటు'



- 11,826కోట్ల ట్రూ అప్ వడ్డనకు డిస్కంల ప్రతిపాదన
- 19లోపు అభ్యంతరాలు తెలపాలన్న ఎపిఇఆర్‌సి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా విద్యుత్ వినియోగదారులపై భారం తప్పడం లేదు. ట్రూఅప్, సర్దుబాటు అంటూ వివిధ రకాల చార్జీల పేరుతో భారాలపై భారాలు మోపుతున్నాయి. చార్జీలు పెంచబోమంటు ఎన్నికల సమయంలో హామీలిచ్చి అందుకు భిన్నంగా ప్రజలపై భారాలు వేస్తున్నాయి. దీంతో అసలు విద్యుత్ యూనిట్ ధర కంటే వీటి ధర అధికంగా ఉంది. పెరిగిన బిల్లులు చూసుకుంటున్న వినియోగదారులు చెల్లించలేక లబోదిబోమంటున్నారు. తాజాగా 2023-24 సంబంధించిన రూ.11,826.42 కోట్లను ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పిపిసిఎ) పేరుతో వసూలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని విద్యుత్ పంపిణీ సంస్థలు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఎపిఈఆర్‌సి)ని కోరాయి. డిస్కంలు పంపిన ప్రతిపాదనలపై ఈ నెల 19వ తేదిలోపు అభ్యంతరాలు, అభిప్రాయాలు, సూచనలు పంపాలని కమిషన్ కార్యదర్శి సోమవారం ప్రకటన విడుదల చేశారు. అయితే ప్రతిపాదించిన రూ.11,826 వేల కోట్లలో రూ.3700కోట్లను డిస్కంలు ఇప్పటికే వినియోగదారుల ముక్కు పిండి వసూలు చేశాయి. నెల నెల సర్దుబాటు పేరుతో ప్రతి నెల రూ.0.40లు 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు వినియోగదారులపై భారం మోపింది. ఇంకా వసూలు చేయాల్సింది రూ.8,126కోట్లు ఉందని దీనికి కూడా అనుమతి ఇవ్వాలని పంపిణీ సంస్థలు ప్రతిపాదించాయి. ఇప్పటికే 2021-22 ట్రూఅప్ పేరుతో రూ. 3082.99కోట్లు కాకుండా 2023-24 సంవత్సరంలో సర్దుబాటు పేరుతో ప్రతి నెల రూ0.40ల చొప్పున రూ.3,700కోట్లు వసూలు చేశాయి. ఇవి కాకుండా 2022-23 సర్దుబాటు పేరుతో రూ.6,072కోట్లు వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవాలని 10 రోజుల క్రితమే ఎపిఇఆర్‌సి ఉత్తర్వులు విడుదల చేసింది. ఇవి చాలదన్నట్లుగా ఇప్పుడు మళ్లీ మరో ఎనిమిది వేల కోట్ల రూపాయలు వసూలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరాయి. ఏ నెలకు ఎంత భారం మోపాలనే ప్రతిపాదనలు కమిషన్ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. మార్కెట్ నుంచి యూనిట్‌కు సరాసరి రూ.8లకు సుమారు 12వేల మిలియన్ యూనిట్లు(ఎంయు)కొనుగోలు చేశాయి. ఇదే సమయంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో మిగతా 2లో

విజయవాడ అన్సారీ పార్క్ వద్ద విద్యుత్ భారాలపై విడుదల చేసిన నోటిఫికేషన్‌ను దహనం చేస్తున్న సిపిఎం నేతలు సిహెచ్.బాబూరావు, దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి తదితరులు

ట్రూఅప్ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ట్రూఅప్ ప్రతిపాదనలను విరమించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధిక ధరలతో ఒకవైపు, ఆదాయాలు తరిగిపోయి మరోవైపు ప్రజలు సతమతమవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో ప్రజలపై రాష్ట్రప్రభుత్వం ఎఫిపిసిఎ పేరుతో తాజాగా రూ.12వేల కోట్లు, ఇటీవల రూ.6వేల కోట్లు మొత్తం రూ.18వేల కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారం వేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఇటీవల వేసిన రూ.6072 కోట్ల భారం ఇంకా అమల్లోకి రాకముందే అంతకు రెట్టింపు భారాన్ని అదనంగా ప్రజలపై మోపడం దారుణమని పేర్కొన్నారు. తాజా ప్రతిపాదనలో యూనిట్ విద్యుత్‌కు గరిష్టంగా రూ.2.50లు వడ్డిస్తున్నారని తెలిపారు. నిరుపేద గృహస్తులు యూనిట్‌కు చెల్లించే రూ.1.90లకు ఇది 130శాతం అధికమని పేర్కొన్నారు. డిస్కంల బహిరంగ ప్రకటనలో మొత్తం ఎంత భారం వేశారో, అది ఎందుకు అవసరమయ్యిందో కనీసం ఒక్క వాక్యం కూడా ఇవ్వకపోవడం ప్రజలను మోసగించడమేనని తెలిపారు. ప్రభుత్వ విద్యుత్ ప్లాంట్ల నుంచి కరెంటు తీసుకోకుండా(బ్యాక్ డౌన్‌చేసి) అధిక ధరలకు ఓపెన్ మార్కెట్‌లో చెల్లింపులు చేయడం ఇందుకు ముఖ్యకారణమని విమర్శించారు. ప్రైవేట్ కంపెనీలకు అడ్డగోలుగా చెల్లింపులు చేయడం మరోకారణమని తెలిపారు. ప్రభుత్వాల తప్పుడు విధానాలు, అవినీతి, అక్రమాలకు ప్రజలను బలిచేయడం తగదని పేర్కొన్నారు. ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు భారాలు మోయాలనడం అసంబద్ధమని పేర్కొన్నారు. మోసపూరితమైన ట్రూఅప్ విధానాన్ని రద్దు చేయాలని, మొత్తం రూ.18వేల కోట్ల ట్రూఅప్ భారాన్ని ఉపసంహరించాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గొల్లప్రోలు సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

పరిస్థితులు చేయి దాటితే హోం శాఖ తీసుకుంటా...

యోగి ఆదిత్యనాథ్‌లా వ్యవహరిస్తా : డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

'నేను పంచాయతీరాజ్ శాఖ మంత్రిని. హోం మంత్రిని కాదు. పరిస్థితులు చేయి దాటితే హోం శాఖ తీసుకుంటా. అప్పుడు పరిస్థితులు వేరేలా ఉంటాయి.' అని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు కలకలం రేపాయి. ప్రభుత్వంపై వైసిపి విమర్శలు ఎక్కుపెట్టగా, టిడిపికి చెందిన ఇతర మంత్రులు సర్దుబాటు ధోరణిలో మాట్లాడుతున్నారు. అంతకు ముందు పిఠాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను పవన్ కల్యాణ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో జరిగిన సభలో మాట్లాడుతూ పోలీసుల పని తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'క్రిమినల్‌కు కులం మతం ఉండవు. ఈ విషయం పోలీసు అధికారులకు ఎన్ని సార్లు చెప్పాలి. మూడేళ్ల ఆడబిడ్డను అత్యాచారం చేసి చంపేస్తే కులాన్ని వెనకేసుకొస్తారా?' అని ప్రశ్నించారు. 'ఆ మాత్రం ధైర్యం లేనప్పుడు పోలీసులుగా ఉండడం ఎందుకు.?' అని అన్నారు. 'నేను ఈ రోజు చెబుతున్నా. ఇలాగే ఏమీ చేయకుండా ఉండండి. గుర్తుపెట్టుకోండి హోంశాఖ కూడా తీసుకోవాల్సి ఉంటుంది. నేను అడగలేక కాదు. తీసుకోలేక కాదు.నేను హోంశాఖ తీసుకుంటే పరిస్థితులు వేరేలా ఉంటాయి. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ చేసినట్లుగా క్రిమినల్స్‌కు చేయాల్సిఉంటుంది.' అని అన్నారు. ముఖ్యమంత్రిని చంపేస్తానని బెదిరించిన వ్యక్తిని పోలీసులు ఎందుకు వదిలేస్తున్నారని, ఇళ్లలోకి వెళ్లి మహిళలపై అత్యాచారం చేస్తుంటే ఏం చేస్తు న్నారని ప్రశ్నించారు.' గత ఐదేళ్లలో 30 వేల మంది ఆడపిల్లలు అదృశ్యమైతే అప్పటి సిఎం ఏం మాట్లాడ లేదు,అప్పులు ఎలా వారసత్వంగా వచ్చాయో... గత ప్రభుత్వ తప్పిదాలూ అలానే వచ్చాయి' అని చెప్పారు.

తెగేదాకా లాగొద్దు...

ప్రస్తుతం ధర్మబద్ధంగా చేయాలని ప్రాధేయ పడుతున్నా పోలీసు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని, అది సరికాదని అన్నారు.

'పోలీసు అధికారులు ఎందుకు అలా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు' క్రిమినల్స్‌ను వెనకేసుకు రావాలని భారత శిక్షాస్మృతి చెబుతోందా? అని ప్రశ్నించారు. విషయాన్ని తెగేదాకా లాగొద్ద న్నారు. ఈ ప్రభుత్వానికి సహనం ఎంత ఉందో, తెగింపు కూడా అంతే ఉందని, అధికారంలో ఉన్నాం కాబట్టి సంయమనం పాటిస్తున్నామని పేర్కొన్నారు.

అనితకు కూడా చెబుతున్నా...

హోం మంత్రి అనితకు కూడా చెబుతున్నా... 'మంత్రిగా మీరు బాధ్యత తీసుకోవాలి' అని పవన్ కల్యాణ్ అన్నారు. డిజిపిగారూ.. 'మేము బయటకు వస్తే ప్రజలు మమ్మలను తిడుతున్నారు. ఆడబిడ్డల మాన, ప్రాణ సంరక్షణ బాధ్యత పోలీసు ఉన్నతాధికారులు తీసుకోవాలి' అని అన్నారు.

మతసామరస్యం కోసం

లౌకిక శక్తులు ఏకం కావాలి

- వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలి.. కడప స్టీల్ ప్లాంట్‌ను పూర్తి చేయాలి
- ప్రజా సమస్యలపై 14న 'ప్రజా పోరు'
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో మత సామరస్యం కోసం లౌకిక శక్తులన్నీ ఏకం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మత సామరస్యానికి ప్రతీకగా ఉన్న రాష్ట్రంలో ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్, సంఘపరివార్ మత విద్వేషానికి కుట్ర పన్నుతున్నాయని, ఆ కుట్రలను ఛేదించాలని ఆయన పిలుపునిచ్చారు. మూడు రోజుల పాటు ఢిల్లీలో జరుగుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సమావేశానికి హాజరైన వి శ్రీనివాసరావు సోమవారం మీడియాతో మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్, సంఘ పరివార్, విశ్వహిందూ పరిషత్ మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు కుట్రలు పన్నుతున్నాయని, అందులో భాగంగానే విశ్వహిందూ పరిషత్ జనవరి 5న హైందవ శంఖారావం పేరుతో మత వైషమ్యాలను పెంచి పోషించేందుకు కార్యక్రమం నిర్వహిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి విభజన చర్యలకు అనుమతి ఇవ్వొద్దని సూచించారు. అలాగే సనాతన ధర్మ పరిరక్షణ కోసం నరసింహ వారాహి దళాన్ని జనసేన అధినేత పవన్‌కల్యాన్ ఏర్పాటు చేశారని, సనాతన ధర్మం పేరుతో కుల వివక్ష, మహిళలపై అణచివేతకు బలం చేకూర్చే యత్నాలను తిప్పికొట్టాలన్నారు.

టిటిడిలో సమానత్వం తీసుకురావాలి

టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు హిందూవేతరులను టిటిడి నుంచి తొలగించి, వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తామనడం హిందూత్వ అజెండాలో భాగమని అన్నారు. అటువంటప్పుడు హిందువులైన దళితులను, పూజారులను అర్చకులుగా నియమించాలని సూచించారు. బిఆర్ నాయుడు అలా చేయగలరా? అంటూ ప్రశ్నించారు. హిందూవేతరులు ఉండకూడదనుకుంటే బిబి నాంచారమ్మను ఏం చేస్తారని ప్రశ్నించారు. అన్నిటికంటే టిటిడిలో అవినీతి, కుల వివక్ష ఎక్కువగా ఉందని, చేతనైతే ఆ మరకలను పోగొట్టాలని అన్నారు. . టిటిడిలో కుల వివక్ష పోగొట్టి, సమానత్వాన్ని తీసుకురావాలని మిగతా 2లో

పాత టెండర్లు రద్దు

- అమరావతి చుట్టూ రింగురోడ్డు
- జనవరిలోగా ప్రధాన భవనాలకు టెండర్లు
- రాజధాని పరిధిలో ఐదు రిజర్వాయర్లు
- సిఆర్‌డిఎ అథారిటీ సమావేశం అనంతరం మంత్రి నారాయణ

సిఆర్‌డిఎ అథారిటీ 39వ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు, చిత్రంలో నారాయణ తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఆర్‌డిఎ పరిధిలోని పాత టెండర్లు అన్నింటిని రద్దు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో సిఆర్‌డిఎ అథారిటీ 39వ సమావేశం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో 15 అంశాలను చర్చించారు. సమావేశ నిర్ణయాలను మీడియా ప్రతినిధులకు మంత్రి నారాయణ వివరించారు. సిఆర్‌డిఎ అథారిటీ తీసుకున్న నిర్ణయం మేరకు పాత టెండర్లన్నింటిని రద్దు చేస్తామని మంత్రి చెప్పారు. హైకోర్టు, అసెంబ్లీ భవనాలు తప్ప మిగిలిన పనులకు డిసెంబరు 31లోపు టెండర్లు పిలుస్తామని తెలిపారు. హైకోర్టు, అసెంబ్లీ భవనాలకు జనవరి 2025లోపు టెండర్లు పిలుస్తామని తెలిపారు. రానున్న ఐదేళ్లలో ప్రపంచంలోనే ఐదు ఉత్తమ నగరాల్లో అమరావతి ఒకటిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. అమరావతికి రూ.15 వేల కోట్లు ఇచ్చేందుకు ప్రపంచబ్యాంకు ఆమోదం తెలిపిందని, అయితే వరద నివారణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని బ్యాంకు ప్రతినిధులు కోరారని వివరించారు. 217 చదరపు కిలోమీటర్ల పరిధిలోని అమరావతిలో కొండవీటి, పాలవాగు గ్రావిటీ రిజర్వాయర్లు, నీరుకొండ, కృష్ణాయపాలెం, మిగతా 2లో

టెట్‌లో 50.07 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం ఎక్స్ వేదికగా ఈ ఫలితాలను విడుదల చేశారు. అక్టోబర్ 3 నుంచి 21 వరకు జరిగిన ఈ పరీక్షకు 4,27,300 మంది దరఖాస్తు చేసుకోగా, 3,68,661 మంది హాజరయ్యారు. హాజరైన వారిలో 1,87,256 (50.79 శాతం) మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. పేపర్-1ఎకు 1,60,017 మంది హాజరవ్వగా, 1,04,785 (65.48 శాతం) అర్హత సాధించారు. పేపర్-1బికు 2,173 మందికి 767 (35.3 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. పేపర్-2ఎ (ఎస్‌ఎ ల్యాంగ్వేజ్)కు 55,781 మంది హాజరవ్వగా 22,080 (39.58 శాతం), పేపర్-ఎ2 (ఎస్‌ఎ లెక్కలు)కు 88,290 మందికి 33,525 (37.97 శాతం) మంది, పేపర్-2 (ఎస్‌ఎ సోషల్)కు 60,442 హాజరవ్వగా, 24,472 (40.49 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. పేపర్-2బికు 1,958 మంది హాజరవ్వగా, 1,627 (83.09 శాతం) అర్హత సాధించారు.

11 నుంచి అసెంబ్లీ సమావేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఈ నెల 11న ఉదయం 10 గంటలకు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు సోమవారం గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. సమావేశాలు 10 రోజులపాటు నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఈ సమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్‌తో పాటు పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన డ్రోన్ పాలసీ, కొత్త రేషన్‌కార్డులు, దీపం పథకం, పోలవరం, అమరావతి, తిరుపతి కల్తీ లడ్డూ, పెన్షన్ పెంపు, మెగా డిఎస్‌సి, నూతన టూరిజం పాలసీ, నూతన పారిశ్రామిక విధానం గురించి చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

విగ్రహావిష్కరణ విషాదం

- విద్యుదాఘాతానికి నలుగురు మృతి
- సిఎం, డిప్యూటీ సిఎం విచారం

ప్రజాశక్తి- ఉండ్రాజవరం (తూర్పు గోదావరి), అమరావతి బ్యూరో

విగ్రహావిష్కరణ ఏర్పాట్లు వారి ఇంట విషాదాన్ని నింపింది. విద్యుదాఘాతం నలుగురు యువకులను బలిగొంది. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... తాడిపర్రులో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్తీక మాసం మొదటి సోమవారం రోజున అంగరంగ వైభవంగా చేపట్టి, అన్న సమారాధన నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. దీనిలో భాగంగా భాగంగా 30 అడుగుల ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ఫ్లెక్సీని కడుతుండగా ఇనుప ఊచలతో ఉండే ఫ్రేమ్ విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో, బొల్లా వీర్రాజు (25), కాశగాని కృష్ణ(23), పామర్తి నాగేంద్ర (25), మారిశెట్టి మణికంఠ (29) అక్కడికక్కడే మృతి చెందారు. కోమటి అనంతరావు తీవ్రంగా గాయపడగా తణుకు ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. ఉండ్రాజవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మణికంఠ (ఫైల్)

పామర్తి నాగేంద్ర (ఫైల్)

బొల్లా వీర్రాజు (ఫైల్)

కాసగాని కృష్ణ (ఫైల్)

బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పన పరిహారం

ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని ప్రకటించారు. ఈ మేరకు వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

రూ.6 లక్షల కోట్ల సంపద ఆవిరి

ఆల్‌టైం కనిష్టానికి రూపాయి

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు మరోమారు కుప్ప కూలాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో మదుపర్లు ముందస్తు అప్రమత్తతతో అమ్మకాలకు మొగ్గు చూపారు. దీంతో సోమవారం ఒక్క పూటలోనే బిఎస్‌ఇ సెన్సెక్స్ 942 పాయింట్లు పతనమై.. మూడు నెలల కనిష్టానికి పడిపోగా.. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 1 శాతం క్షీణించి 24,000 పాయింట్ల దిగువకు జారింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు వెల్లువ చోటుచేసుకుంది. ఉదయం స్వల్ప నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. క్రమంగా భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఈ క్రమంలోనే బిఎస్‌ఇ సెన్సెక్స్ 941.88 పాయింట్లు లేదా 1.18 శాతం క్షీణించి 78,782కు దిగజారింది. ఇది ఆగస్టు 6 నాటి కనిష్ఠ స్థాయి. కాగా.. ఇంట్రాడేలో ఏకంగా 1,491 పాయింట్లు కోల్పోయి.. 78,232.60 కనిష్ఠ స్థాయిని తాకింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 309 పాయింట్ల నష్టంతో 23,995 వద్ద ముగిసింది. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.11 ఆల్‌టైం కనిష్టానికి పడిపోయింది.

లోయలో పడిన బస్సు

ఉత్తరాఖండ్‌లో ఘోరం

- బస్సు లోయలో పడి 36 మంది మృతి
- 24 మందికి గాయాలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో సోమవారం ఘోర ప్రమాదం సంభవించింది. అల్మోర జిల్లాలో ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు 150 అడుగుల లోతైన లోయలో పడిపోవడంతో 36 మంది మరణించగా, మరో 24 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. అల్మోర జిల్లాలోని మార్చుల ప్రాంతం కుపి గ్రామం సమీపంలో ఉదయం 8 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. అప్పటికి బస్సులో మొత్తం 60 మంది ప్రయాణీకులు ఉన్నారు. బాధితులంతా కార్మికులని, వారాంతపు సెలవు కావడంతో స్వస్థలాలకు వచ్చి, మళ్లీ పనిలోకి తిరిగివెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. 43 సీట్ల సామర్థ్యం ఉన్న బస్సులో సామర్థ్యానికి మించి 60 మంది ఉన్నారని, ఓవర్‌లోడింగే బస్సు లోయలో పడ్డానికి దారితీసిందని అధికారులు చెబుతున్నారు. గార్వాల్ మోటార్ ఓనర్ అసోసియేషన్‌కు చెందిన ఈ బస్సు పౌరీ నుంచి 250 కిలోమీటర్లు దూరం ఉన్న కుమౌన్‌లోని రామ్‌నగర్‌కు వెళుతుండగా గమ్యస్థానానికి 35 కిలోమీటర్ల దూరంలో బస్సు ఒక్కసారిగా అదుపు తప్పి లోయలో మిగతా 2లో

దేశంలోనే బెస్ట్ స్పోర్ట్స్ పాలసీ

- రిజర్వేషన్ల కోటా 3 శాతానికి పెంపు
- పతకాలు సాధిస్తే భారీ నజరానా
- సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న స్పోర్ట్స్ పాలసీ ఇతర రాష్ట్రాల పాలసీల కంటే మిన్నగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. కొత్త స్పోర్ట్స్ పాలసీపై అధికారులతో సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని క్రీడా కేంద్రంగా మార్చేందుకు అందరికీ క్రీడలు, ప్రతిభను పెంపొందించడం, స్పోర్ట్స్ ఎకో సిస్టం, గ్లోబల్ విజిబిలిటీ అనే అంశాల ప్రాతిపదికగా పాలసీ రూపొందించామన్నారు. ప్రతిభకు గుర్తింపు, ప్రపంచ స్థాయి శిక్షణ, ప్రోత్సాహకాలు, క్రీడాకారులకు మద్దతు, ఉద్యోగ భద్రత, ప్రపంచ స్థాయి సౌకర్యాలు, క్రీడా సంఘాలతో సమన్వయం, సాంకేతికతను వినియోగించడం, ప్రైవేటు రంగంతో కలిసి పనిచేయడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల నిర్వహణ, స్పోర్ట్స్ టూరిజం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా అధికారులు సమర్పించిన పలు ప్రతిపాదనలకు సిఎం ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకూ ఉద్యోగాల్లో ఉన్న క్రీడా రిజర్వేషన్‌ల కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచాలని నిర్ణయించారు. యూనిఫారం సర్వీసెస్‌లో 3 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కొత్త పాలసీలో ప్రతిపాదించినట్లు చెప్పారు. శాప్‌లో గ్రేడ్ 3 కోచ్‌ల కోసం ఇంటర్నేషనల్ మెడల్స్ సాధించిన వారికి 50 శాతం రిజర్వేషన్ కల్పించామన్నారు.

ప్రోత్సాహకాలు భారీగా పెంపు

క్రీడాకారులకు గుర్తింపు, గౌరవం ఉండాల్సిన అవసరం ఉందని సిఎం చంద్రబాబు అన్నారు. ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధిస్తే ఇచ్చే ప్రోత్సాహకం ప్రస్తుతం రూ.75 లక్షలు ఉండగా, దీనిని రూ.7 కోట్లకు, రజత పతకానికి రూ.50 లక్షల నుంచి రూ.5 కోట్లు, కాంస్య పతకానికి రూ.30 లక్షల నుంచి రూ.3 కోట్లకు పెంచాలని అధికారులకు సూచించారు. ఒలింపిక్స్‌లో పాల్గొన్నవారికి రూ.50 లక్షలు ఇవ్వాలన్నారు. ఏషియన్స్ గేమ్స్‌లో బంగారు పతకం సాధిస్తే రూ.4 కోట్లు, రజతానికి రూ.2 కోట్లు, కాంస్య పతకానికి రూ.1 కోటి చొప్పున ప్రోత్సాహకాలు, ఈ గేమ్స్‌లో పాల్గొన్న వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని సూచించారు. వరల్డ్ ఛాంపియన్ షిప్, వరల్డ్ కప్ పోటీల్లో బంగారు పతకం సాధిస్తే రూ.50 లక్షలు, రజత పతకానికి రూ.35 లక్షలు, కాంస్య పతకానికి రూ.25 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జాతీయ క్రీడల్లో బంగారు పతకం సాధిస్తే రూ.10 లక్షలు, రజత పతకానికి రూ.5 లక్షలు, కాంస్య పతకానికి రూ.3 లక్షలు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రతిపాదించారు. ఖేల్ ఇండియా గేమ్స్, నేషనల్ స్కూల్ గేమ్స్‌లో బంగారు పతకం సాధిస్తే రూ.2.50 లక్షలు, రజత పతకానికి రూ.2 లక్షలు, కాంస్య పతకానికి రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు.

ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్‌లో పతకాలు సాధించిన వారిని గ్రూప్-1 ఉద్యోగులుగా నియమిస్తామని చెప్పారు. అమరావతిని స్పోర్ట్స్ సిటీగా, తిరుపతి, వైజాగ్, అమరావతిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కడప, విజయవాడ, విజయనగరంలలో క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేస్తామని, విజయనగరం క్రీడా పాఠశాలను గిరిజనులకు కేటాయిస్తామని తెలిపారు. మండల, నియోజకవర్గ స్థాయిలో క్రీడా వికాస కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు. స్పోర్ట్స్ లీగ్‌లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం ఉండేలా చూడాలన్నారు. రాష్ట్రానికి తీరప్రాంతం, కొండలు, అడవులు పుష్కలంగా ఉన్నందున మౌంటెయిన్ బైకింగ్, వాటర్ స్పోర్ట్స్, నేచర్ ఫొటోగ్రఫీ, ట్రెక్కింగ్ వంటి వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. పిపిపి విధానంతోపాటు స్వచ్ఛందంగా ఆసక్తి చూపే వ్యక్తులు, సంస్థలతో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలన్నారు. ఈ సూచనలకు అనుగుణంగా మార్పులు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ ఎ రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం.. గేమ్ ఛేంజర్

సాంకేతికతను వినియోగించి వ్యవసాయంలో రైతులకు ఖర్చులు గణనీయంగా తగ్గించవచ్చని, నాడు ఐటి ఎలాగో రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయం కూడా గేమ్ ఛేంజర్ అవుతుందని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రకృతి సేద్యంలో టెక్నాలజీని జోడించడం ద్వారా అనూహ్య ఫలితాలు సాధించవచ్చన్నారు. వ్యవసాయశాఖపై సిఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులను ప్రోత్సహించేందుకు నూతన విధానాలను తీసుకురానున్నామని తెలిపారు. ప్రకృతి సేద్యం - అగ్రిడిప్ టెక్ విధానంతో దేశానికి, రాష్ట్రం వ్యవసాయ రంగంలో దిక్సూచి అయ్యేలా చేయాలని అందుకు అవసరమైన ప్రణాళికలు అమలు చేయాలని ఆదేశించారు. పంటల సాగుకు 40 వేల డ్రోన్లు అవసరమవుతాయని, సాగులో డ్రోన్లకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.8 లక్షల వరకు ఇస్తుందని, తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కూడా కల్పిస్తుందని అన్నారు. ఈ పథకాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సిఎం సూచించారు. డ్వాక్రా సంఘాల మహిళలకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇచ్చి డ్రోన్ పైలెట్లుగా తీర్చిదిద్దితే ఇదొక కుటీర పరిశ్రమ అవుతుందన్నారు. కేబినెట్ సబ్ కమిటీ సూచనల ప్రకారం ఈ రబీ నుంచి పాత పద్ధతిలో క్రాప్ ఇన్సూరెన్స్ అందుబాటులోకి తెస్తున్నట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పిఎంఎవై 2.0 కోసం కేంద్రంతో ఎంఒయు

- డిప్యూటేషన్‌పై 597 మంది ఉద్యోగులు
- గృహ నిర్మాణశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పిఎంఎవై 2.0 పథకం ప్రారంభించేందుకు కేంద్రంతో ఎంఒయు కుదుర్చుకునేందుకు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణశాఖ అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖపై సోమవారం సచివాలయంలో సిఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2029 నాటికి అర్హులైన అందరికీ ఇళ్లు నిర్మించే లక్ష్యంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో అన్ని లే అవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. డ్రోన్ల ద్వారా ఇళ్ల నిర్మాణ నాణ్యత, కొలతలు తీసుకునేందుకు గృహ నిర్మాణశాఖ అధికారులు పెద్ద లే అవుట్లలో కూడా వినియోగించాలన్నారు. గృహ నిర్మాణశాఖలో 597 మంది సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకునేందుకు సిఎం అంగీకారం తెలిపారు. 2026 నాటికి మరో 7.60 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పిఎంఎవై అర్బన్ కింద 58,578 ఇళ్లు, పిఎంఎవై గ్రామీణం కింద 17,197 ఇళ్లు నిర్మించినట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఆ శాఖ స్పెషల్ సిఎస్ అజయ్‌జైన్, ఎమ్‌డి రాజాబాబు పాల్గొన్నారు.

డోలీ మోత మధ్యలో గిరిజనుడు మృతి

ప్రజాశక్తి - అనంతగిరి రూరల్ (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లాలో డోలీ మోతల మరణాలు నేటికీ తగ్గడం లేదు. అనంతగిరి మండలం గుమ్మ పంచాయతీ కర్రిగూడ గ్రామానికి చెందిన సారా లచ్చన్న (50) ఆదివారం రాత్రి కడుపు నొప్పితో బాధ పడుతుండడంతో డోలీ మోతతో కుటుంబ సభ్యులు లుంగపర్తి పిహెచ్‌సికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆయన మృతి చెందాడు. కర్రిగూడ నుంచి లుంగపర్తి పిహెచ్‌సికి 22 కిలోమీటర్లు. రోడ్డు సదుపాయం లేకపోవడంతో డోలీ మోతతో సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం వెళ్లిన తర్వాత ఆరోగ్య పరిస్థితి విషమించి లచ్చన్న కన్నుమూశారు. రోడ్డు సదుపాయం తమ గ్రామానికి ఉన్నట్లయితే లచ్చన్న మృతి చెందేవారు కాదని కుటుంబీకులు తెలిపారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతోనే ఆయన మృతిచెందాడని ఆవేదన వ్యక్తం చేశారు.

నూతన జడ్జిలకు సన్మానం

ప్రజాశక్తి-అమరావతి

హైకోర్టు న్యాయమూర్తులుగా ఇటీవల ప్రమాణం చేసిన జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్, జస్టిస్ చల్లా గుణ రంజన్‌లను సోమవారం హైకోర్టు న్యాయవాదుల సంఘం సత్కరించింది. అడ్వకేట్లుగా ప్రాక్టీస్ చేసిన తమకు న్యాయవాదుల సమస్యలు తెలుసునని న్యాయమూర్తులు పేర్కొన్నారు. సంఘంతో తమకున్న అనుబంధాన్ని వారు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కలిగినీడి చిదంబరం, ఉపాధ్యక్షులు నగరూరు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి నన్నపనేని శ్రీహరి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పి పొన్నారావు తదితరులు పాల్గొన్నారు

ముందస్తు బెయిల్ పిటిషన్ వాపస్

విశాఖపట్నంలోని హయగ్రీవ భూముల వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) పెట్టిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలనే పిటిషన్‌ను వ్యాపారవేత్త ఎంవివి సత్యనారాయణ వాపస్ తీసుకున్నారు. ఇందుకు జస్టిస్ విఆర్ కృపాసాగర్ అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేశారు. హయగ్రీవ భూముల వ్యవహారంలో అవకతవకలపై ఇడి గత నెల 19న కేసు నమోదు చేసింది.

కేసులు కొట్టేయండి : కాకాణి

ముత్తుకూరు పోలీసులు నమోదు చేసిన 2 కేసుల్ని కొట్టేయాలంటూ వైసిపి నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. కోర్టు కేసు తేలేవరకు పోలీసులు కఠిన చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులివ్వాలనే పిటిషన్‌ను జస్టిస్ విఆర్ కృపాసాగర్ విచారణ చేయనున్నారు. మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై కాకాణి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ టిడిపి మండల ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా వైసిపి ఆఫీసులో పిటిషనర్ విలేకరుల సమావేశంలో చంద్రబాబు ప్రతిష్టను దెబ్బతీసేలా తప్పుడు ఆరోపణలు చేశారంటూ వెంకటాచలం టిడిపి నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రెండు కేసులు నమోదు చేయడాన్ని కాకాణి హైకోర్టులో సవాలు చేశారు.

హెచ్‌ఆర్‌సి భర్తీ కోరుతూ పిల్

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సి) ఛైర్మన్, సభ్యులను నియమించకపోవడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది తాండవ యోగేష్ పిల్ దాఖలు చేశారు. 4 వారాల్లోగా నియామకాలు జరిగేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఛైర్మన్, ఇతర సభ్యుల పదవీకాలం గత మార్చిలో ముగిసినా ఇప్పటి వరకు నియమించలేదన్నారు. నియామకాల కోసం మార్చి 15న నోటిఫికేషన్ వెలువడినప్పటి కీ ఫలితం లేదన్నారు. ఛైర్మన్, సభ్యులు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ఫిబ్రవరిలో నిర్వహించండి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూపు-2 మెయిన్స్ పరీక్షను జనవరి 5 కాకుండా, అభ్యర్థుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు ఫిబ్రవరిలో నిర్వహించాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఇటీవల నియమితులైన ఎపిపిఎస్‌సి ఛైర్మపర్సన్ అనురాధను విజయవాడలోని సంస్థ కార్యాలయంలో సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు ఇప్పటికే ప్రకటించినప్పటికీ వాటిని 1:50 బదులుగా 1:100 నిష్పత్తికి ఫలితాలు ప్రకటించాలని కోరారు. డివైఇఒ పరీక్షకు ప్రిలిమినరీ కటాఫ్ మార్కులు తగ్గించాలని, ఇతర నోటిఫికేషన్‌లకు పరీక్ష తేదీలు ప్రకటించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఎపిపిఎస్‌సి ఛైర్‌పర్సన్‌కు డివైఎఫ్ఐ వినతి

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను ఫిబ్రవరిలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపిపిఎస్‌సి ఛైర్‌పర్సన్ అనురాధను విజయవాడలోని సంస్థ కార్యాలయంలో డివైఎఫ్ఐ కార్యదర్శి జి రామన్న సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జనవరి 5న పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించడంతో గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని కనీసం 90 నుంచి 120 రోజుల గడువు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో డివైఎఫ్ఐ నాయకులు పి కృష్ణ, శివ, గోపి ఉన్నారు.

అయిభీమవరంలో ఇళ్ల తొలగింపునకు యత్నం

- అడ్డుకున్న నివాసితులు, సిపిఎం నాయకులు

రోడ్డుపై బైఠాయించిన సిపిఎం నాయకులు, నివాసితులు

ప్రజాశక్తి - ఆకివీడు

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం అయిభీమవరం గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న ఇళ్ల తొలగింపు కోసం అధికారులు చేసిన ప్రయత్నం రసాభాసగా మారింది. గ్రామంలో కాలువ గట్టున ఉన్న ఇళ్లను వెంటనే తీసివేయాలని 40 రోజుల క్రితమే అధికారులు నోటీసులు జారీ చేశారు. తమకు కొత్తగా మంజూరు చేసిన స్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు కోరారు. తాము ఖాళీ చేయడానికి మూడు నెలల సమయం కావాలని ఎమ్మెల్యే రఘురామరాజును అప్పట్లో నివాసితులు కోరారు. ఈ లోగా సోమవారం అధికారులు ఇళ్లకు కూల్చివేసేందుకు వచ్చారు. పట్టాలు ఇచ్చిన స్థలాల వద్ద ఏ విధమైన మౌలిక సదుపాయాలూ లేవని, అవి ఏర్పాటు చేస్తే ఖాళీ చేస్తామని నివాసితులు తెలిపారు. అధికారులు అవేవి పట్టించుకోకుండా జెసిబిలతో ఇళ్లు తొలగించే ప్రయత్నం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో రోడ్డుకు అడ్డంగా నివాసితులు బైఠాయించారు. ఓ దశలో పోలీసులకు వారికి మధ్య తోపులాట చోటు చేసుకుంది. తులసి అనే ఒక వివాహితకు దెబ్బతగిలి సొమ్మసిల్లి పడిపోయారు. పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు, సిఐ వి.జగదీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని... పై అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని, సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఇళ్లను కూల్చివేయడానికి వచ్చిన వారు వెనుదిరగడంతో నివాసితులు ఆందోళన విరమించారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై అధ్యయనానికి మంత్రివర్గ ఉపసంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యం నియంత్రణ తో పాటు వీటికి అలవాటు పడిన వారికి పునరావాసంపై అధ్యయనం చేయడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రివర్గ ఉపసంఘానికి ఛైర్మన్‌గా హోం మంత్రి, సభ్యులుగా మానవ వనరుల అభివృద్ధి శాఖ, ఎక్సైజ్ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రులు ఉంటారు. హోం శాఖ ముఖ్యకార్యదర్శి మెంబర్ కన్వీనర్‌గా కొనసాగుతారని పేర్కొన్నారు. ఇటువంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాల నివారణకు ఇప్పటికే ఉన్న చట్టాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థ పని తీరును అంచనా వేసి, తీసుకోవాల్సిన చర్యలపై సిఫార్సులు చేస్తోంది.

మాదకద్రవ్యాల సరఫరా, వినియోగం నివారించేందుకు అనుసరించాల్సిన విధానాలు, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించే చర్యలపై సూచనలు ఇస్తుంది. గంజాయి సాగు, వినియోగాన్ని నివారించడానికి సూచనలు చేయనుంది.

కర్నూలు-బళ్లారి రహదారిపై ఆందోళన చేస్తున్న స్థానికులు

యురేనియం తవ్వకాలపై ప్రజాగ్రహం

- రోడ్డెక్కిన తొమ్మిది గ్రామాల ప్రజలు
- క్రిమిసంహారక మందు డబ్బాలతో మహిళల నిరసన
- ఈదులదేవరబండ బస్‌స్టేజీ వద్ద రాస్తారోకో

ప్రజాశక్తి - దేవనకొండ,కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులో యురేనియం తవ్వకాలు నిలుపుదల చేయాలని చేపట్టిన ప్రజా ఉద్యమం ఉధృత రూపం దాల్చింది. యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ఈదులదేవరబండ బస్సుస్టేజీ వద్ద కర్నూలు-బళ్లారి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దేవనకొండ మండలం బేతపల్లి, బంటుపల్లి, గుండ్లకొండ, గుడిమిరాళ్ల, చెల్లెలిచెలిమల, మాదాపురం, కె. వెంకటాపురం, ఈదుల దేవరబండ, మాచాపురం గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి రహదారిపై రాస్తారోకో చేశారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అక్కడే బైఠాయించారు. 'మా ప్రాణాలైనా అర్పిస్తాం... యురేనియం తవ్వకాలు అడ్డుకుంటాం' అంటూ క్రిమిసంహారక మందు డబ్బాలతో మహిళలు నినాదాలు చేశారు. కరివేముల వద్ద కర్నూలు - బళ్లారి రహదారిపై గ్రామస్తులు రాస్తారోకో చేశారు. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష ఆదేశాలతో పత్తికొండ డిఎస్‌పి వెంకటరామయ్య, ఆర్‌డిఒ భరత్‌నాయక్, ఆదోని ఫారెస్ట్ డివిజనల్ అధికారి తేజస్విని అక్కడకు చేరుకొని వారితో మాట్లాడారు. సర్వే మాత్రమే చేస్తున్నామని ఎటువంటి తవ్వకాలు చేపట్టడం లేదని అధికారులు తెలిపారు. కప్పట్రాళ్లలో సర్వేతో పాటు ఏటువంటి కార్యక్రమాలు చేపట్టవద్దని ఆందోళనకారులు హెచ్చరించారు. లేదంటే రెండురోజుల తర్వాత ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. యురేనియం తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు యురేనియం వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. సిఎం చంద్రబాబు దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్తానని మంత్రి చెప్పారు.

పాత టెండర్లు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

శాఖమూరు, ఉండవల్లి ప్రాంతాల్లో స్టోరేజీ రిజర్వాయర్లను నెదర్లాండ్స్ డిజైన్ల ప్రకారం నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. అమరావతి చుట్టూ బైపాస్ రహదారుల నిర్మాణం జరిగినా ఔటర్, ఇన్నర్ రింగురోడ్లనూ నిర్మిస్తామని మంత్రి తెలిపారు. అమరావతి అభివృద్ధి కోసం 2014-19 మధ్యకాలంలో రూ.41 వేల కోట్ల విలువైన టెండర్లను పిలిచామని, వాటిల్లో రూ.35 వేల కోట్ల విలువైన పనులు ప్రారంభించామని తెలిపారు. వీటిలో హైకోర్టు, అసెంబ్లీ భవనాలతోపాటు రహదారులు, హైకోర్టు జడ్జిలు, మంత్రులు, అధికారుల వసతి గృహాల నిర్మాణాలకు సంబంధించిన పనులు చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వం మూడు రాజధానులు అంటూ అమరావతిలో పనులన్నింటిని నిలిపివేసిందని చెప్పారు. కాంట్రాక్టు ఏజెన్సీలకు బిల్లులు చెల్లించకుండా పెద్దఎత్తున బకాయిలు పెట్టిందని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునేందుకు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏర్పాటు చేసిన చీఫ్ ఇంజినీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని, ఆ నివేదికను పరిశీలించిన అనంతరం తుది నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వివరించారు.

లౌకిక శక్తులు ఏకం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. అంతేతప్ప ఆర్‌ఎస్‌ఎస్‌కు వంతపాడొద్దని, రాష్ట్రానికి మంచిది కాదని హితవు పలికారు.

ప్రజా సమస్యలపై 'ప్రజా పోరు'

రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ఈ నెల 14న 'ప్రజా పోరు' ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. జమిలి ఎన్నికలు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా ఆందోళన చేపడతామని అన్నారు. అలాగే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని, విభజన చట్టంలో పేర్కొన్న కడప స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అంతే తప్ప వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు పోటీగా అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలర్ మిట్టల్‌కు ఉక్కు ఫ్యాక్టరీ పెట్టేందుకు ఐదు వేల ఎకరాలు ఇవ్వడం దారుణమని, దీన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. ఎపిఐఐసి ఐదు వేల ఎకరాలు అప్పన్నంగా మిట్టల్‌కు ఇచ్చి, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయాలని చూస్తున్నట్లుందని విమర్శించారు.

మిల్లర్లపై మార్కెట్ సెస్ ఒక శాతానికి తగ్గింపు : మంత్రి నాదెండ్ల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మిల్లర్లపై మార్కెట్ సెస్ రెండు శాతం నుంచి ఒక శాతానికి తగ్గించాలనే అంశంతోపాటు నిత్యావసర వస్తువుల ధరల పర్యవేక్షణపై మంత్రుల కమిటీలో చర్చించినట్లు, ఇదే అంశాన్ని ఈ నెల 6న కేబినెట్ సమావేశం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో సోమవారం జరిగిన జాతీయ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు, మిల్లర్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతినిధులను ఏర్పాటు చేసి ప్రతి విషయంలోనూ పారదర్శకంగా ఉండేలా కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు మిల్లర్లు సహకరించాలన్నారు. దేశ వ్యాప్తంగా యూనిఫామ్ పాలసీ తీసుకొచ్చేలా అందరమూ కలిసి లోతుగా అధ్యయనం చేద్దామన్నారు. రూ.19,800 కోట్ల టర్నోవర్ ఉన్న పౌరసరఫరాలశాఖలో రూ.41,150 కోట్లు బకాయిలు చేసి గత వైసిపి ప్రభుత్వం వెళ్లిపోయిందన్నారు. చివరికి రైతులకు కూడా బకాయిలు చెల్లించకుండా కాలం వెళ్లదీసిందన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్.. మంచి నిర్ణయం తీసుకోవడంతో రైతులకు నెల రోజుల్లోనే రూ.1,674 కోట్లు బకాయిలు చెల్లించినట్లు ఆయన తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యేలోపే రూ.283 కోట్లు బకాయిలు చెల్లించామని, మరో వారం రోజుల్లో రూ.200 కోట్లు చెల్లిస్తామని వెల్లడించారు. వరదల సమయంలో బాధితులకు 25 కేజీల బియ్యం అందించడంలో మిల్లర్లు ఎంతో సహకరించారని మంత్రి పేర్కొన్నారు.

విద్యార్థులకు మంచి భోజనం అందిస్తాం : కోన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు మంచి భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ పేర్కొన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకానికి ప్రతియేటా రూ.2 వేలకోట్లు ఖర్చు చేస్తుందని చెప్పారు. బడి భోజనం మెనూ ప్రామాణికతపై మంగళగిరిలో జరిగిన వర్క్‌షాప్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లలకు భోజనంలో మంచిగా ఆహార పదార్థాలు అందించాలనే అంశంపై అన్ని జిల్లాల నుంచి మెనూ తీసుకునేలా కసరత్తు చేస్తున్నామని చెప్పారు. స్థానికంగా పండించే కూరగాయలను ఆహార పదార్థాలుగా అందించేలా మెనూలో చేర్చాలని చెప్పారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ శాస్త్రవేత్త జె శ్రీనివాస్, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ కృతికా శుక్లా, గుంటూరు జిల్లా కలెక్టరు నాగలక్ష్మి తదితరులు మాట్లాడారు.

'కూటమి'లో లుకలుకలు బట్టబయలు

- బిజెపి ఎమ్మెల్యే తీరును నిరసిస్తూ మంత్రి వద్ద వినూత్న నిరసన

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న టిడిపి నాయకుడు రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లాలో టిడిపి కూటమి నేతల మధ్య లుకలుకలు సోమవారం బట్టబయలయ్యాయి. ఆదోని బిజెపి ఎమ్మెల్యే తమను నిర్లక్ష్యం చేస్తున్నారంటూ మంత్రి నిమ్మల రామానాయుడు వద్ద టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కర్నూలు నగరం దీనికి వేదికైంది. కర్నూలు జిల్లాలోని టిడిపి కూటమి ఎమ్మెల్యేలతోనూ, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతోనూ టిడిపి జిల్లా కార్యాలయంలో మంత్రి నిమ్మల తొలుత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం బయటకు వచ్చిన ఆయనకు ఆదోని బిజెపి ఎమ్మెల్యే తీరుపై ఆరెకల గ్రామ మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు రామకృష్ణ కళ్లకు గంతలు కట్టుకొని పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. వైసిపి వారితో బిజెపి ఎమ్మెల్యే కుమ్మక్కై తమను ఏ మాత్రమూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిత్ర ధర్మానికి తూట్లు పొడుస్తున్నారని, దీనివల్ల ఆదోని నియోజకవర్గంలోని టిడిపి కేడర్‌కు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యేపై మంత్రికి ఫిర్యాదు చేశారు. టిడిపి కార్యకర్తలకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. దీంతో, ఆయనకు మంత్రి సర్ది చెప్పారు. అనంతరం మౌర్య ఇన్ హోటల్లో టిడిపి కూటమి ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలోనూ బిజెపి ఎమ్మెల్యేపై పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ, ఆదోని నియోజకవర్గంలో టిడిపిలో ఐదారు గ్రూపులు నడుస్తున్నాయని, సమన్యాయం కావాలని టిడిపి చేసిన డిమాండ్ మంచిదేనని, అదే సమయంలో జిల్లాలోని అందరూ టిడిపి ఎమ్మెల్యేలూ ఆయా నియోజకవర్గాల్లో బిజెపికి సమన్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు కనిగిరి నీలకంఠ మాట్లాడుతూ జిల్లాలోని డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన నిర్వాహక పోస్టుల నియామకాల్లో తమ కార్యకర్తలకు వాటా దక్కడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. జనసేన జిల్లా అధ్యక్షులు చింత సురేష్ మాట్లాడుతూ తమ పార్టీ కార్యకర్తలకు పోస్టుల కేటాయింపులో సమన్యాయం పాటించాలని కోరారు.

విద్యారంగాన్ని నాశనం చేసిన వైసిపి

- టిడిపి అధికార ప్రతినిధి విజయ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యారంగాన్ని గత వైసిపి ప్రభుత్వం కకావికలం చేసిందని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్ ఆరోపించారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ దీనికి ఆద్యులని విమర్శించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు దగ్గరలో ఉన్న పాఠశాలలను మూసివేయించారని విమర్శించారు. 2 లక్షల మంది విద్యార్థులు పాఠశాల డ్రాపవుట్స్‌గా మారారని పేర్కొన్నారు. సిబిఎస్ఇ, బైజూస్‌లో కమీషన్లకు కక్కుర్తి పడ్డారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలకు రంగులు వేసి రూ.50 వేల కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. జిఒ 117 తెచ్చి విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని తెలిపారు.

గ్రీవెన్స్ నిర్వహించిన మంత్రి కొండపల్లి

టిడిపి కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. మాజీ మంత్రి పీతల సుజాతతో కలిసి ప్రజల నుంచి వచ్చిన వినతులు, అర్జీలను స్వీకరించారు. సమస్యలు పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.

ఉత్తరాఖండ్‌లో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

పడిపోయింది. ప్రయాణికుల నుంచి పెద్దయెత్తున కేకలు వినిపించాయి. కొందరు బస్సు నుంచి అతి కష్టం మీద బయటకు రాగా, మరి కొందరు బస్సుల్లోనే ఇరుక్కుపోయారు. ఘటనా స్థలిలో దృశ్యాలు ప్రతి ఒక్కరిని కలచివేస్తున్నాయి. ప్రమాద వార్త తెలిసిన వెంటనే పోలీసులు, జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు అక్కడకు చేరుకుని సహాయక కార్యక్రమాలు చేపట్టాయి. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో, వీరిలో ముగ్గుర్ని ఎయిర్‌లిఫ్ట్ ద్వారా రిషికేష్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. మరొకర్ని హల్దవానిలోని సుశీల తివారీ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి, ప్రధాని నరేంద్రమోడీ విచారం వ్యక్తం చేశారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారుల్ని ఆదేశించినట్లు సిఎం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 1 లక్ష చొప్పున సిఎం పరిహారం ప్రకటించారు. మరణించిన వారిపై ఆధారపడిన కుటుంబాలకు రూ 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున పిఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి పరిహారం అందజేయనున్నట్లు ప్రధాని ప్రకటించారు.

మరో 'సర్దుపోటు'

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న జెన్‌కో ప్లాంట్లలో సుమారు 7,500 ఎంయుల విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశాయి.

డిస్కంల వారీగా ఇలా

ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎపిఎస్‌పిడిసిఎల్) రూ.3,968.67కోట్లను కమిషన్‌కు ప్రతిపాదించింది. ఇందులో రూ.1,148.89కోట్లు ఇప్పటికే ప్రతి నెల రూ.0.40ల చొప్పున వసూలు చేసింది. ఇంకా రూ.2,819.78కోట్లు వసూలు చేయాలని కోరింది. 7,433.746 మిలియన్ యూనిట్లను యూనిట్‌కు రూ.6.90ల చొప్పున రూ.5,358.75 కోట్లతో బయట మార్కెట్ నుంచి కొనుగోలు చేసింది. ఇందులో స్వల్ప కాలిక ఒప్పందాల పేరుతో 4,221.42 ఎంయులను సరాసరి రూ.8.31లకు కొనుగోలు చేశారు.అత్యధికంగా ఏప్రిల్‌లో రూ.9.69ల, సెప్టెంబర్‌లో రూ.9.66 చొప్పు కొనుగోలు చేశాయి. ఆంధ్రప్రదేశ్ మధ్య పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఎపిసిపిడిసిఎల్) రూ.2,145.69కోట్లు ప్రతిపాదించింది. ఇందులో రూ.625.74కోట్లు సర్దుబాటు కింద ప్రతి నెల వసూలు చేసింది. ఇంకా రూ.1,520.46 వసూలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరింది.ఎపిఇపిడిసిఎల్ ఎంత భారం ప్రతిపాదించే అంశాలను పొందుపరచలేదు. బహిరంగ మార్కెట్ నుంచి 7,433.746 ఎంయులను రూ.5,300ల కోట్లతో కొనుగోలు చేసింది.

మాజీ ఎంపి సురేష్‌కు 18 వరకు రిమాండ్

ప్రజాశక్తి మంగళగిరి (గుంటూరు జిల్లా)

మాజీ ఎంపి నందిగం సురేష్‌ను సోమవారం తుళ్లూరు పోలీసులు మంగళగిరి కోర్టులో హాజరుపరిచారు. మంగళగిరి కోర్టు ఆయనకు నవంబర్ 18 వరకు రిమాండ్ విధించింది. వెలగపూడి దళితవాడలో 2020 డిసెంబర్ 27న జరిగిన రాళ్లదాడిలో మెండెం మరియమ్మ అనే వృద్ధురాలు చనిపోయారు. ఈ కేసులో నందిగం సురేష్‌ను ముద్దాయిగా పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరు జైలులో ఉన్న నందిగం సురేష్‌ను మంగళగిరి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

కృష్ణా ప్రాజెక్టులపై ఎపి, తెలంగాణ పిటిషన్లపై విచారణ వాయిదా

- 2 పిటిషన్లను కలిపి విచారించనున్న సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా ప్రాజెక్టుల పరిధిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ ఈ నెల 7 నాటికి వాయిదా పడ్డాయి. కృష్ణా బేసిన్‌పై ఉన్న నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) పరిధిలోకి తెస్తూ 2021లో కేంద్రం గెజిట్ రిలీజ్ చేసింది. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విద్యుత్ కేంద్రాలను కెఆర్ఎంబి పరిధిలోకి తీసుకురావాలని ఎపి ప్రభుత్వం 2021, జులై 14న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సంబంధిత అథారిటీ అనుమతి లేకుండా తెలంగాణ ప్రభుత్వం తమ పరిధిలో ఉన్న విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని పిటిషన్‌లో ఆరోపించింది. తెలంగాణ నిర్ణయం వల్ల ప్రాజక్టుల్లో నీటి వాటా వినియోగంలో తేడాలు వస్తున్నాయని పేర్కొంది. మరోవైపు కేంద్రం తెచ్చిన ఈ గెజిట్‌ను రద్దు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబర్‌లో సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ రెండు పిటిషన్లు సోమవారం సుప్రీంకోర్టులోని వేర్వేరు ధర్మాసనాలు విచారించాయి. తొలుతగా తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్ జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. ఎపి పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌ల మరో ధర్మాసనం ఆంధ్రప్రదేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ప్రత్యేక ఆర్డర్ కావాలంటే ఆదేశాల్లో కోరవచ్చని ఎపి తరపు న్యాయవాదులకు మెహతా సూచించారు. ఈ వాదనలపై ఎపి తరపు న్యాయవాదులు పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... తెలంగాణ దాఖలు చేసిన కేసుతో ఓవర్ ల్యాప్ అవుతాయని అభిప్రాయపడింది. అందువల్ల ఎపి పిటిషన్‌ను తెలంగాణ పిటిషన్ విచారిస్తున్న ధర్మాసనానికి బదిలీ చేయాలని చెబుతూ... ఈ విషయాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) దృష్టికి తీసుకెళ్లాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది.

విశాఖలో ఎన్ఐపిఇఆర్

- కేంద్ర మంత్రి నడ్డాకు ఎంపి లావు వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నేషనల్ ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐపిఇఆర్)ను త్వరగా ఏర్పాటు చేయాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జెపి నడ్డాను టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ మేరకు సోమవారం నాడిక్కడ కేంద్ర మంత్రి జెపి నడ్డాను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నైపర్ సంస్థ గడచిన ఆరేళ్లుగా ఆగిపోయిందని, దాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేసే విషయంపై చర్చించినట్లు తెలిపారు. నైపర్ సంస్థకు భూమితో పాటు, అన్ని విధాలుగా సహకరించేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రూ.30 వేల కోట్ల నుండి రూ.40 వేల కోట్లు ఫార్మా ఎగుమతులు విశాఖ కేంద్రంగా జరుగుతున్నాయని, వీటికి అనుగుణంగా నైపర్‌ని విశాఖపట్నంలో ఏర్పాటుచేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రికి చెప్పినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారికి చేయాల్సిన ఆరోగ్య పరీక్ష కేంద్రాలను ఉత్తరాంధ్రలో గానీ, రాయలసీమలో గానీ ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. 10 లక్షల జనాభాకు 100 మెడికల్ సీట్లు అనే నిబంధనను సవరించి రాష్ట్రంలో మెడికల్ సీట్లు పెంచేలా వెసులుబాటు ఇవ్వాలన్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో క్రిటికల్ కేర్ యూనిట్లు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.

శ్రీ శ్రీనివాస కళాశాల పరీక్షా కేంద్రం రద్దు

- కొనసాగుతున్న దూరవిద్య ప్రత్యేక బృందాల తనిఖీలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

దూరవిద్య పరీక్షల నిర్వహణలో అవకత వకలకు పాల్పడిన ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని రద్దు చేసినట్లు దూరవిద్య కో-ఆర్డినేటర్ ఆచార్య డి రామచంద్రన్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో జరుగుతున్న యుజి, పిజి, డిప్లొమా కోర్సుల పరీక్ష కేంద్రాల ఆకస్మిక తనిఖీలు సోమవారం కొనసాగాయి. కర్నూలు జిల్లాలో జరుగుతున్న దూరవిద్య పరీక్ష కేంద్రాలను వర్సిటీ ప్రత్యేక పరిశీలక బృందం తనిఖీ చేపట్టింది. గూడూరులోని శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాలలో యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. పరీక్ష నిర్వాహకులు పలు అవకతవతలకు పాల్పడినట్లు గుర్తించి, రద్దుచేశారు. ఈ కేంద్రంలో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా కర్నూలులోని బి తాండ్రపాడు ఎస్ఎల్ఎస్ కళాశాలకు పరీక్షా కేంద్రాన్ని మార్చారు. తనిఖీల నివేదికను వర్సిటీ అధికారులకు సమర్పించినట్టు పరిశీలక బృందం సభ్యులు తెలిపారు.

22, 23 తేదీల్లో జాతీయ మహిళా సమ్మేళనం

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎన్‌జిఒ అధ్యక్షులు శివారెడ్డి

సమ్మేళనం లోగో, పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, కెవి శివారెడ్డి తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ సమీపంలోని పోరంకి మురళీ రిసార్ట్స్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో 6వ జాతీయ మహిళా సమ్మేళనం నిర్వహించనున్నట్లు పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులు కెవి శివారెడ్డి తెలిపారు. జాతీయ మహిళా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం విజయవాడ గాంధీనగర్‌లోని ఎపి ఎన్‌జిఒ భవనంలో సమ్మేళనం లోగో, పోస్టర్‌ను లక్ష్మణరావు, కెవి శివారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమాఖ్య (confederation of central government employees and workers (ccgew) ఎపి, తెలంగాణ యూనిట్ల ఆధ్వర్యాన జాతీయ మహిళా సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనంలో వివిధ రాష్ట్రాల్లోని పోస్టల్, ఇన్‌కమ్ ట్యాక్స్, సెంట్రల్ ఎక్సైజ్, జిఎస్ఐ, ఎస్ఒఐ, ఎజి ఆఫీస్, సిపిడబ్ల్యుడి, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో వంటి అనేక డిపార్టుమెంట్లకు సంబంధించిన మహిళా ఉద్యోగులందరూ ఈ సమాఖ్యలో సభ్యులేనని అన్నారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా సిఐటియు జాతీయ కార్యదర్శి, వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ ఎఆర్ సింధుతో పాటు పలువురు జాతీయ నాయకులు హాజరవుతారని తెలిపారు. జాతీయ మహిళా సమ్మేళన సమావేశం ఈ నెల 22న ఉదయం పది గంటలకు ప్రారంభమవుతుందని, సమావేశానికి దేశంలోని అనేక ప్రాంతాల నుంచి కేంద్ర ప్రభుత్వ విభాగాలకు చెందిన సుమారు 200 మంది డెలిగేట్స్ హాజరవుతారని తెలిపారు.

జాతీయ మహిళా సమ్మేళనం ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా కెఎస్ లక్ష్మణరావు

జాతీయ మహిళా సమ్మేళనాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటుచేశారు. అధ్యక్షులుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, వ్యవహరించనున్నారు.

సభ్యులుగా ఉమెన్ సబ్ కమిటీ, కాన్ఫెడరేషన్ ఆలిండియా కన్వీనరు ఐ సుశీలారాణి, రిసెప్షన్ కమిటీ కన్వీనర్లుగా ఎం సుభాకర్‌రావు, కె పున్నారెడ్డి, రిసెప్షన్ కమిటీ వర్కింగ్ ఛైర్మన్ బి శ్రీధర్‌బాబు, ఎపి, టిఎన్, ఐటిఇఎఫ్ సర్కిల్ సెక్రటరీ కెవి రమణారావు, విజయవాడ ఎజి ఆఫీస్ జనరల్ సెక్రటరీ గౌతమ్‌కుమార్ వ్యవహరించనున్నారు.

ఎరుకొండలో మళ్లీ ఇంటింటి సర్వే

- అతిసార బాధితులకు కలెక్టర్ పరామర్శ
- వైద్యాధికారులపై ఆగ్రహం
- గ్రామంలో పర్యటన

ప్రజాశక్తి - పూసపాటిరేగ (విజయనగరం)

బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్, ఆర్‌డిఒ

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం ఎరుకొండలో మళ్లీ డయేరియా విజృంభించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ సోమవారం గ్రామంలో పర్యటించారు. ముందుగా పూసపాటిరేగ పిహెచ్‌సిలో వైద్యం పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య వివరాలను వైద్యాధికారి రాజేష్‌వర్మను అడిగి తెలుసుకున్నారు. అందరి ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆయన చెప్పారు. డయేరియా వచ్చి ఎన్ని రోజులైందని ఓ భాధితుడిని కలెక్టర్ అడిగారు. కొద్దిరోజుల క్రితం డయేరియా రావడంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నానని, ఇంటికి వెళ్లిన తరువాత మళ్లీ రావడంతో ఆస్పత్రికి వచ్చానని బాధితుడు సమాధాన మిచ్చాడు. వైద్యం పూర్తిగా అందడం లేదా..? మరేదైనా లోపమా అంటూ డాక్టర్‌ను కలెక్టర్ ప్రశ్నించారు. గ్రామీణ నీటి సరఫరా పైపు లైన్లు మరమత్తులకు గురవడం వల్ల నీరు కలుషితమై డయేరియా వచ్చినట్లు డాక్టర్ రాజేష్‌వర్మ చెప్పడంతో ఆయనపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నువ్వేమైనా ఇంజనీరువా...పైపులైన్లు లీక్ అయ్యాయని, నీటి కలుషితం అయ్యిందని చెప్పడానికి అంటూ మండి పడ్డారు. ఇంతమంది సిబ్బంది ఉన్నా కూడా డయేరియాను కంట్రోల్ చేయలేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం ఎరుకొండ గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును సందర్శించి, బాధితుల పరిస్థితిపై ఆరా తీశారు. గ్రామంలో ఇటీవల గ్రామ దేవత పండగ జరిగిందని, ఆహారం కలుషితం కావడంతో ఇలా జరిగి ఉండొచ్చని సర్పంచి జి. అప్పల స్వామి కలెక్టర్‌కు తెలిపారు. గ్రామంలో ఆరోగ్య సిబ్బందితో మళ్లీ ఇంటింటా సర్వే చేయించి, ఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఇ బి.ఉమాశంకర్, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఆర్‌డిఒ డి.కీర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ కవిత, తాహశీల్దార్ తాడ్డి గోవింద, ఎంపిడిఒ రాధిక, మెడికల్ ఆఫీసర్ రాజేష్ వర్మ ఇతర అధికారులు సిబ్బంది ఉన్నారు. డయేరియాతో పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న తొమ్మిది మందిలో ఆరుగురు డిశ్చార్జి కాగా ముగ్గురు చికిత్స పొందుతున్నారు. గ్రామ వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న వారిలో ఐదుగురూ డిశ్చార్జి అయ్యారు.

హాస్టల్ విద్యార్థి మృతిపై విచారణ

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

విజయనగరంలోని బిసి బాలుర వసతి గృహం విద్యార్థి కొణతాల శ్యామలరావు (12) మృతిపై జిల్లా విద్యాశాఖ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. జిల్లా విద్యాశాఖ ఎడి గౌరీశంకరరావు, సిఇసి బోర్డు సభ్యులు సన్యాసిరాజు, ఎంఇఒ, కస్పా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బృందంగా వచ్చి విచారణ జరిపారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థులు, సిబ్బందిని విచారించి రాత పూర్వకంగా వివరాలు తీసుకున్నారు. వార్డెన్ జానకిరామ్‌ను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎడి గౌరీశంకరరావు మాట్లాడుతూ.. విచారణలో వచ్చిన అంశాలను జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర అధికారులకు తెలియచేస్తామని చెప్పారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంటుందని తెలిపారు.

'ట్రూఅప్' భారంపై 6 నుంచి నిరసనలు : కాంగ్రెస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలపై విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల భారానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రాజా తెలిపారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో 6న జరిగే నిరసనలో పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పాల్గొంటారని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7, 8వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఆయా జిల్లా కమిటీల ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ట్రూఅప్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.

ఉల్లి మార్కెట్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

- గిట్టుబాటు ధర కల్పించాలి
- మంత్రి నిమ్మలకు ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం ఇస్తున్న జి.రామకృష్ణ

కర్నూలు వ్యవసాయ మార్కెట్లోని అవకతకవలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎపి రైతు సంఘం జిల్లా ప్రతినిధి బృందం సోమవారం వినతిపత్రం సమర్పించింది. వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించడానికి వచ్చిన మంత్రికి రైతులు తమ సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలలో ఉల్లి పంట సాగయిందని, దిగుబడి కొంత మేరకు వచ్చినప్పటికీ మార్కెట్లో వ్యాపారుల సిండికేట్ వల్ల ధర పూర్తిగా పడిపోయి రైతులు నష్ట పోతునారని మంత్రి దృష్టికి తెచ్చారు. కొన్ని లాట్లు మాత్రమే ఎక్కువ రేటు చూపించి అత్యధిక ఉల్లి పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఆఫ్ లైన్ అయినా ఆన్‌లైన్ అయినా వ్యాపారులందరూ మాట్లాడుకుని రైతులకు ధర రాకుండా చేస్తున్నారన్నారు. ఉల్లి రైతులకు ఎకరాకు రూ. లక్షపెట్టుబడి అవుతోందని, మార్కెట్లో గత వారం చాలామంది రైతుల ఉల్లి పంట కేవలం రూ.450 నుండి రూ.1000 లోపే పలికిందని వివరించారు. అంతే కాక మహారాష్ట్ర నుండి పూనా ఉల్లిగడ్డలు రావడం రైతులకు నష్ట దాయకమని, వ్యవసాయ మార్కెట్లో కనీసమైన సౌకర్యాలు లేవని తెలిపారు. సిసి కెమెరాలు లేవని, వేలాది మంది రైతులు వచ్చే వ్యవసాయ మార్కెట్‌కు కనీసం మంచినీటి సదుపాయమైనా లేదని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ రైతులు చెప్పిన డిమాండ్లు, సమస్యలు ప్రభుత్వం పరిష్కారిస్తుందని రైతు నాయకులకు హామీ ఇచ్చారు. ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు జి ఆంజనేయులు, కార్మిక నాయకులు టి రాముడు, వృత్తి సంఘాల నాయకులు సి గురుశేఖర్, నాయకులు అబ్దుల్లా, రంగప్ప ఉన్నారు.

హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచాలి

నీటిపారుదల శాఖ మంత్రికి సిపిఎం వినతి

హంద్రీనీవా కాల్వసామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులు పెంచడానికి అవసరమైన నిధులు కేటాయించి హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలని కోరుతూ భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె ప్రభాకర్ రెడ్డి, వి రాంభూపాల్, సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ వినతి పత్రం అందజేశారు. వారు మంత్రితో మాట్లాడుతూ కరువు పీడిత ప్రాంతంగా ఉన్న రాయలసీమ పంట పొలాలకు నికర సాగు జలాలు తీసుకురావడానికి గతం నుండి అనేక ప్రతిపాదనలు చేశారన్నారు. ఈ ప్రాంతంలో చాలా కాలం పాటు ఇంజనీర్‌గా పనిచేసిన డాక్టర్ శివరామకృష్ణయ్య, శ్రీశైలం డ్యాంకు వరద వచ్చినప్పుడు డ్యామ్ వెనక నుండి 60 టిఎంసిల నీటిని తీసుకుని కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, ఉమ్మడి జిల్లాల తాగునీరు వనరులు అభివృద్ధి చేయడానికి అవకాశం ఉందని తెలిపారు.



ముఖ్యమంత్రికి పంపుతున్న లేఖను చూపుతున్న సిపిఎం నాయకులు

సాగునీటి అభివృద్ధికి నిధులివ్వండి

- సిఎంకు సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ లేఖ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా సాగునీటి వనరుల అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్లో ఏడు వేల కోట్ల నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ పంపుతున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి తుంగభద్ర డ్యాం కొత్త గేట్ల నిర్మాణానికి మన వాటా నిధులను ఇవ్వాలని కోరారు. హంద్రీనీవా పంట కాలువల నిర్మాణానికి రూ.1,200 కోట్లు కేటాయించి వెంటనే పూర్తి చేయాలన్నారు. కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచేందుకు రూ. రెండు వేల కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు చెబుతున్నారని, ఇందుకు అవసరమైన నిధులను కేటాయించాలని కోరారు. ఉంతకల్లు జలాశయ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలన్నారు. బిటి ప్రాజెక్టుకు జీడి పల్లి నుంచి మొదలు పెట్టిన ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు. పిఎబిఆర్ కుడికాలువకు సాగునీరు ఇవ్వాలన్నారు. సుబ్బరాయ సాగర్‌కు నీటిని విడుదల చేయాలని కోరారు. చెరువులు, కుంటలను పటిష్టం చేసి నీటితో నింపాలన్నారు. రైతు సామూ హిక బిందు సేద్య పథకాలను పూర్తి చేయాలని అందుకు అవసరమైన బడ్జెట్లో కేటాయించాలని కోరారు. వీటిన్నింటినీ పూర్తి చేసి ఆదుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రికి లేఖ పంపుతున్నట్లు ఆయన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ నాగేంద్రకుమార్, ఎం బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ చంద్రశేఖర్‌రెడ్డి, మన్నీల రామాంజనేయులు పాల్గొన్నారు.

పే స్కేల్ కోసం విఆర్ఎల ధర్నా

- కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేత

ప్రజాశక్తి - యంత్రాంగం

పే స్కేల్ అమలు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్లు తదితర పోస్టుల్లో అర్హులైన విఆర్ఎలకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (విఆర్ఎ), సిఐటియు ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద విఆర్ఎలు ధర్నా చేపట్టారు. తమకు సంబంధం లేని పనులు అప్పగించరాదని, పిఆర్‌సి ప్రకారం వేతనాలు ఇవ్వాలని, నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని పెద్ద ఎత్తున నినదించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. అనకాపల్లి కలెక్టరేట్, అల్లూరి జిల్లా పాడేరు పట్టణంలోనూ ఆందోళనలు చేపట్టారు. పాడేరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళంలో ఆర్అండ్‌బి బంగ్లా నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. విజయనగరం, పార్వతీపురంలో కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం గౌరవాధ్యక్షులు బి.సూర్యనారాయణ, వై.మన్మధరావు మాట్లాడారు. నామినీలుగా పనిచేస్తున్న వారందరిని విఆర్ఎలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నెల్లూరులో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె. పెంచల నరసయ్య, జిల్లా అధ్యక్షులు భాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేస్తున్న విఆర్ఎలకు గత ఏడు సంవత్సరాల నుంచి వేతనం పెంచకపోవడం దుర్మార్గమన్నారు. తెలంగాణలో విఆర్ఎలందరిని పర్మినెంట్ చేశారని, పే స్కేలు అమలు చేశారని చెప్పారు. మన రాష్ట్రంలో కూడా విఆర్ఎలందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కడప, అన్నమయ్య, సత్యసాయి, ఏలూరు, కర్నూలు, నంద్యాల కలెక్టరేట్ల వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విఆర్ఎలు, సిఐటియు నాయకులు

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఏపి - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహ అబ్లిగెంట్ (లు) : 1. మెస్సర్స్ అమ్మా కాటన్ ట్రేడర్స్, ప్రొప్రయిటర్ : శ్రీ వద్దూరి శ్రీనివాసరావు, చిరునామా : డి.నెం. 6-27-10, దారావొన్ని బిల్డింగ్స్, 1వ లైన్, సాలిపేట, గుంటూరు - 522002. 2. శ్రీ వద్దూరి శ్రీనివాసరావు (ఋణగ్రహీత & తనఖాదారు), తండ్రి : రంగయ్య, చిరునామా : ఫ్లాట్ నెం. 406, ఎస్‌విఆర్ ఎంపైర్, కొత్తపేట, మెయిన్ రోడ్డు, గుంటూరు - 522001. 1. శ్రీ వద్దూరి శ్రీనివాసరావు (హామీదారు) తండ్రి : రంగయ్య, చిరునామా : డి.నెం. 9-11-144, నిస్సంకర వి వారి వీధి, కొత్తపేట, మెయిన్ రోడ్డు, గుంటూరు - 522001.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి శ్రీ వద్దూరి శ్రీనివాసరావు గారి బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు తేది. 11-04-2023 ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని తేది. 13-06-2023 న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎఆర్‌బి బ్రాంచ్ కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది.

విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు తేది. 11-04-2023 నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖాపెట్టబడిన ఆస్తి వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి : ఆస్తి నెం. 1 : శ్రీ వద్దూరి శ్రీనివాసరావు గారి పేరిట గుంటూరు, ఆర్‌టిసి కాలనీ ఎక్స్‌టెన్షన్, గణపతి గుడి దగ్గర, సమీప డోర్ నెం. 15-15-155, గుంటూరు డి.నెం. 536 వద్ద 958.30 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ నివాస స్థలము. హద్దులు : తూర్పు : నాదెండ్ల పుష్పావతి తదితరుల ఆస్తి - 218 లింకులు లేదా 143.10 అ॥, దక్షిణం : 30 లింకుల వెడల్పు రోడ్డు - 90 లింకులు లేదా 59.5 అ॥, పడమర : 37 1/2 లింకుల వెడల్పు రోడ్డు - 222 లింకులు లేదా 146.6 అ॥, ఉత్తరం : చెంగయ్య గారి ఆస్తి - 90 లింకులు లేదా 59.5 అ॥. పై సరిహద్దుల మధ్య 958.3 చ॥గ॥లు లేదా 801.23 చ॥మీ॥ల విస్తీర్ణంలోని స్థలము మాత్రమే. సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 3528/2009, తేది : 03-02-2009, కోఆర్డినేట్స్ : 16.301923, 80.471911

తేది : 16-10-2024 అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఏపి - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహ అబ్లిగెంట్ (లు) : 1. మెస్సర్స్ స్నేహ ఇండస్ట్రీస్, ప్రొ॥ శ్రీమతి పంచార్యా కిరణ్ (ఋణగ్రహీత), భర్త : సురేష్ పంచార్యా, చిరునామా : డి.నెం. 11-782/4, పట్టాభి సీతారామయ్య నగర్, నగరాలు, అమరావతి, గుంటూరు జిల్లా, ఎపి - 522306. 2. శ్రీమతి పంచార్యా కిరణ్ (తనఖాదారు), భర్త : సురేష్ పంచార్యా, చిరునామా : ఫ్లాట్ నెం. 401, 4వ అంతస్తు, సాయి మౌలీష్ టవర్స్, 10వ లైన్, శ్యామలానగర్, గుంటూరు జిల్లా, ఎపి - 522306. 1. శ్రీ శ్రీరామ్ శ్రీనివాసరావు (హామీదారు) తండ్రి : గోవర్ధన్, చిరునామా : డోర్ నెం. 15-14-72/2, 5/5 లైన్, ఆర్‌టిసి కాలనీ, గుంటూరు జిల్లా, ఎపి - 522301. 2. శ్రీమతి పంచార్యా కిరణ్ (హామీదారు), భర్త : సురేష్ పంచార్యా, చిరునామా : డి.నెం. 24-08-30, ఆర్. అగ్రహారం, నరసింహా స్వామి గుడి దగ్గర, గుంటూరు సిటీ, గుంటూరు జిల్లా, ఎపి.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి శ్రీమతి కిరణ్ పంచార్యా గారి బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు తేది. 03-08-2017 ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని తేది. 24-10-2017 న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎఆర్‌బి బ్రాంచ్ కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది.

విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు తేది. 03-08-2017 నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖాపెట్టబడిన ఆస్తి వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి : ఆస్తి నెం. 1 : గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్ డిస్ట్రిక్ట్, ఈదులపాలెం గ్రామ పంచాయితీ ఏరియా, ఈదులపాలెం గ్రామం డి.నెం. 15/1 వద్ద ఎకరా 5.57 సెంట్లు అందలి ఎకరా 2.57 సెంట్లులోని తూర్పు భాగాన గల భూమి ఎకరా 1.00 సెంట్ల విస్తీర్ణంలోని భూమి దానిని ప్లాన్ ప్రకారం ప్లాట్స్ గా మార్చగా అందలి 605 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ నివాస స్థలము. హద్దులు : తూర్పు : సురేష్ పంచార్యా గారికి చెందిన స్థలము అనగా షెడ్యూల్ ఆస్తి., దక్షిణం : ఇతరుల ఆస్తి, పడమర : శ్రీరామ్ శ్రీనివాసరావు గారికి చెందిన స్థలము, ఉత్తరం : రోడ్డు. పైన తెలిపిన నాలుగు సరిహద్దుల మధ్య 605 చ॥గ॥లు లేదా 505.84 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము మరియు దానికి చెందిన అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో సహా. సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 4767/2015, తేది : 14-09-2015, కోఆర్డినేట్స్ : 16.24177828, 80.32324464

తేది : 30-10-2024 అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఏపి - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహ అబ్లిగెంట్ (లు) : 1. శ్రీ దామర్ల వెంకట భార్గవ్ (ఋణగ్రహీత), తండ్రి : సుబ్బయ్య, చిరునామా : డోర్ నెం. 2-4-11, విజయవాడ రోడ్డు, అమరావతి, పల్నాడు జిల్లా, ఎపి - 522020. 2. శ్రీ దామర్ల వెంకట భార్గవ్ (తనఖాదారు), తండ్రి : దామర్ల సుబ్బయ్య, చిరునామా : డోర్ నెం. 12-9-12, శివాలయం గుడి, మాగల బావి వీధి, అమరావతి, పల్నాడు జిల్లా, ఎపి - 522020. 1. శ్రీ గాదె నాగేశ్వరరావు (కో-అప్లికెంట్), తండ్రి : వెంకయ్య, చిరునామా : డోర్ నెం. 8-78, కందిపప్పు మిల్ దగ్గర, అమరావతి, పల్నాడు జిల్లా, ఎపి - 522020

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి శ్రీ దామర్ల వెంకట భార్గవ్ గారి బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు తేది. 06-12-2022 ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని తేది. 13-03-2023 న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎఆర్‌బి బ్రాంచ్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది.

విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు తేది. 06-12-2022 నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖాపెట్టబడిన ఆస్తి వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి : ఆస్తి నెం. 1 : షెడ్యూల్-ఎ : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు సిటీ, రాజరాజేశ్వరిపురం, స్వామి థియేటర్ దగ్గర, నల్లపాడు గ్రామం, డి.నెం. 53/బి, పట్టానెం. 603, బ్లాక్‌నెం. 16, మున్సిపల్ వార్డు నెం. 18, డి.నెం. 3-4-343, 3-4-236/1, 3220.1/2 చ॥గ॥ల విస్తీర్ణంలోని నిర్మించిన కాంచన టవర్స్ అపార్ట్‌మెంట్. హద్దులు : తూర్పు : 30 అ॥ వెడల్పు మున్సిపల్ రోడ్డు - 173.6 అ॥, దక్షిణం : యెరువ ఎన్నెసమ్మ గారి ఆస్తి - 76 అ॥, కండి ఆంజనేయులు గారి ఆస్తి - 64 అ॥ - 140 అ॥, పడమర : 30 అ॥ వెడల్పు మున్సిపల్ రోడ్డు - 240.6 అ॥, ఉత్తరం : రింగ్ రోడ్డు - 140 అ॥.

షెడ్యూల్-బి : గుంటూరు జిల్లా, గుంటూరు సిటీ, పట్టాభిపురం, స్వామి థియేటర్ దగ్గర, డి.నెం. 3-4-343, 3-4-236/1 వద్ద మొత్తం 3220.1/2 చ॥గ॥లు లేదా 2692.75 చ॥మీ॥ల విస్తీర్ణంలో ఆస్తి నందు నిర్మించిన 'కాంచన టవర్స్' అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తు నందు అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 35.78 చ॥గ॥లు లేదా 29.89 చ॥మీ॥ల స్థలంతో పాటు ప్లింత్ ఏరియా 1017.00 చ॥అ॥ల విస్తీర్ణంతో (కామన్ ఏరియాతో సహా) ఫ్లాట్ నెం. 216కి చెందిన నివాస ఫ్లాట్. హద్దులు : తూర్పు : 40.00 అ॥ పంచాయితీ రోడ్డు, పడమర : సంగా లక్ష్మీకాంతం గారి ఆస్తి, ఉత్తరం : మంగళగిరి ఆర్ & బి రోడ్డు, దక్షిణం : సంగా సాంబశివరావు గారి ఆస్తి, హద్దులు : తూర్పు : కామన్ కారిడార్, దక్షిణం : కామన్ కారిడార్, పడమర : శూన్యాకాశము, ఉత్తరం : శూన్యాకాశము. కోఆర్డినేట్స్ : 16.306749, 80.420126. సేల్‌డీడ్ డాక్యుమెంట్‌నెం. 5033/2019, తేది : 30-07-2019

తేది : 16-10-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సంపాదకీయం

సేవ్ కప్పట్రాళ్ల

కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల అటవీ ప్రాంతంలో ప్రమాదకర యురేనియం తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా అనుమతులివ్వడం నిరంకుశ పోకడకు అద్దంపడుతుంది. తమ బతుకులను ఛిద్రం చేసే యురేనియం మైనింగ్ వద్దే వద్దంటూ కప్పట్రాళ్ల పరిసర గ్రామాల ప్రజానీకం పలు విధాలుగా వ్యతిరేకత తెలియజేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెవికెక్కించుకోలేదు. గత్యంతరం లేక 12 గ్రామాల ప్రజలు శుక్రవారం పార్టీలకతీతంగా సమావేశమై యురేనియం తవ్వకాల వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తీసుకుపోయేందుకు జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి)గా ఏర్పడ్డారంటే ఆ ప్రాంత వాసులు యురేనియం మైనింగ్ పట్ల ఎంతగా బెంబేలెత్తుతున్నారో అర్థమవుతుంది. జెఎసి పిలుపు మేరకు శనివారం నాడూ గ్రామాల ప్రజలు కదిలొచ్చి రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించారు. మైనింగ్‌ను ఆపించలేని రాష్ట్ర ప్రభుత్వం, ఆందోళనలో పాల్గొనకుండా ప్రజలను, స్వచ్ఛంద సంస్థల, ప్రజాసంఘాల, వివిధ పార్టీల నేతల కట్టడికి యత్నించింది. విపక్షాలతో పాటు అధికార టిడిపి నాయకులను సైతం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. నిర్బంధాలను, బెదిరింపులను ప్రజలు లెక్క చేయలేదు సరికదా తవ్వకాలు ఆపే వరకు ఉద్యమిస్తామని ప్రతినబూనడం హర్షణీయం. వారి ఏకైక నినాదం 'సేవ్ కప్పట్రాళ్ల'.

రాయలసీమలో యురేనియం నిక్షేపాలున్నాయని దశాబ్దాల కిందటనే ఆటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రిసెర్చ్ (ఎఎండి) ప్రాథమిక అంచనాకొచ్చింది. కడప జిల్లా తుమ్మలపల్లెలో 2007 ప్రాంతంలో తవ్వకాలకు అంకురార్పణ జరిగింది. అక్కడి ప్రజలు మైనింగ్‌ను వ్యతిరేకిస్తూనే ఉన్నారు. పర్యావరణం, నీటి వనరులు కలుషితమవుతున్నాయని నెత్తీనోరు బాదుకుంటున్నారు. కడప బేసిన్‌కు సబ్ బేసిన్ కప్పట్రాళ్ల. అక్కడ 2017 లోనే పరిశోధనల కోసం తొమ్మిది బోర్లను డ్రిల్లింగ్ చేసి యురేనియం నిక్షేపాలున్నట్లు గుర్తించారు. మరిన్ని పరిశోధనలు, నిర్ధారణల కోసం రిజర్వ్ ఫారెస్ట్‌లో పలు చోట్ల 68 బోర్ల తవ్వకాలకు ఎఎండి ప్రతిపాదించగా కేంద్రం అనుమతులిచ్చింది. గత నెలలో నోటిఫికేషన్ జారీ అయింది. ఇదంతా టిడిపి, వైసిపి, ఇప్పుడు టిడిపి ప్రభుత్వాల హయాంలోనే చోటు చేసుకుంది. కేంద్రంలో ఉన్నది బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం. యురేనియం తవ్వకాల వలన కప్పట్రాళ్ల ప్రాంతంలోని 1,200 ఎకరాల అటవీ భూమి, పచ్చని పంట పొలాలు, తోటలు ధ్వంసం అవుతాయని, హంద్రీ-నీవా సహా అన్ని నీటి వనరులు కాలుష్యమవుతాయని, తాము తీవ్ర అనారోగ్యం పాలవుతామని, భవిష్యత్ తరాలకు ముప్పు అనే జనం భయాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద సరైన సమాధానం లేదు.

యురేనియాన్ని అణు ఇంధన ఉత్పత్తికి, ఐసోటోపులు, మెడికల్, ఇండస్ట్రియల్, డిఫెన్స్ కోసం ప్రపంచ వ్యాప్తంగా వినియోగిస్తున్నారు. ప్రమాదమనే యురేనియం తవ్వకాలను, న్యూక్లియర్ పవర్ ప్రాజెక్టులను అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలు తగ్గించాయి. భారత్ వంటి దేశాలకు తరలిస్తున్నాయి. అమెరికా ఒత్తిడితో మన కేంద్ర ప్రభుత్వం ప్రమాదమని, అధిక ఖర్చని తెలిసినా ఆ వైపు చూస్తోంది. బిజెపి సర్కారుకు మైనింగ్ విషయంలో ప్రజలు పట్టట్లేదు. కార్పొరేట్ల లాభాలే పరమావధిగా పని చేస్తోంది. దండకారణ్యం, ఇతర అటవీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులపైనా, రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులు, చట్టాలపై ఏ విధంగా దాడులు జరుగుతున్నాయో చూస్తున్నాం. విశాఖ మన్యంలో బాక్సైట్ అయినా, కప్పట్రాళ్లలో యురేనియం అయినా ప్రజలు, వారి అభిప్రాయంతో పని లేదు. రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలో ఉంది. కేంద్ర ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా ఉంది. కప్పట్రాళ్లలో తవ్వకాలు జరపాలంటే కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం, ఇక్కడి అటవీశాఖ సహకారం తప్పనిసరి. కూటమి సర్కారు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి యురేనియం తవ్వకాల అనుమతులను రద్దు చేయించాలి. ప్రజాభీష్టాన్ని గౌరవించాలి.

మహనీయుల మాట



ఆర్థిక శక్తుల ఒత్తిడి, పెట్టుబడిదారుల లాభాపేక్ష, మార్కెట్ పోటీ పెట్టుబడిదారీ వ్యవస్థను ముందుకు నడిపిస్తాయి. అదే సమయంలో ఆ వ్యవస్థ చేసే దారుణాలకు వ్యతిరేకంగా మానవత్వం తిరుగుబాటు చేస్తుంది. ఈ రెండు అంశాల వల్ల సమాజంలో ఏర్పడిన వైరుధ్యం ప్రస్తుత పరిస్థితుల పట్ల ఏహ్యభావాన్ని పెంచుతుంది. అదే సోషలిజానికి మార్గం సుగమం చేస్తుంది.

- జేమ్స్ కొనొల్లీ,
ఐరిష్ సోషలిస్టు రిపబ్లికన్ పార్టీ స్థాపకుడు.

ప్రజా ప్రస్థానం

ఆర్థిక సిద్ధాంతాల మాయాజాలం

ప్రభాత్ పట్నాయక్

ఇప్పుడు "ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం"గా పిలవబడేదంతా సత్యాన్ని వెలికి తీసే లక్ష్యంతో కాకుండా దానిని మసిపూసి మారేడుకాయ చేసే లక్ష్యంతో నడుస్తోంది. ఆర్థిక శాస్త్రానికి ఉన్న ఈ సైద్ధాంతిక స్వభావాన్ని కార్ల్‌మార్క్స్ లోతుగా గ్రహించాడు గనకనే 'సాంప్రదాయ ఆర్థిక శాస్త్రం', 'అసభ్యకర ఆర్థిక శాస్త్రం' (వల్గర్ ఎకనామిక్స్) అని రెండు రకాలుగా ఆర్థిక శాస్త్రాన్ని వేరుచేసి చూడాలని చెప్పాడు. ఈ రెండో రకపు అర్థశాస్త్రం ఉత్పత్తి ప్రక్రియను పట్టించుకోదు. మారకం మీద మాత్రమే తన దృష్టినంతటినీ పెడుతుంది. ఆ మారకం జరిగే మార్కెట్ లో పాల్గొనే ప్రతీ వ్యక్తీ ఒకేస్థాయిలో ఉంటాడు కనుక ఉత్పత్తి రంగంలో జరిగే దోపిడీ సంగతి పూర్తిగా మరుగున పడిపోతుంది.

పెట్టుబడిదారీ విధానంలో అదనపు విలువ ఎలా వస్తుంది అన్న అంశం మీద మార్క్స్ ప్రధానంగా తన దృష్టినంతా సారించాడు. కనుక ఆ కోణం నుంచే ఆర్థికశాస్త్రం సైద్ధాంతిక స్వభావాన్ని ఆయన చర్చించాడు. ఐతే, మొత్తం వ్యవస్థను పరిశీలించే విషయంలో 'ప్రధాన స్రవంతి ఆర్థికశాస్త్రం' సామ్రాజ్య వాదం అనేది ఒకటుందని గుర్తించదు. సామ్రాజ్యవాదాన్ని పట్టించుకోకపోవడం కాదు. అసలు సామ్రాజ్యవాదం అనేది ఉనికిలో ఉన్న వాస్తవాన్ని అది నిరాకరిస్తుంది.

ఇలా అంటున్నానంటే, ప్రస్తుతం ఆర్థిక శాస్త్ర రంగంలో ఉన్న పండితులందరిలోనూ నిజాయితీ లోపించిందని భావించకూడదు. వారి సిద్ధాంతం సంచరించే పరిధిని దాటడం వారికి సాధ్యం కావడం లేదు. అంతే. బోధనా రంగాన్ని వృత్తిగా ఎంచుకున్నవారు తమ వృత్తిలో పై స్థానాలకు ఎదగాలంటే, వారి పరిశోధనలు ప్రచురించబడాలంటే, వారికి అవార్డులు, పదవులు రావాలంటే వారు 'ప్రధాన స్రవంతి ఆర్థికశాస్త్రం' పరిధిని అతిక్రమించకుండా దానికి లోబడే వ్యవహరించాల్సి వుంటుంది. ఆ పరిధిని గనుక అతిక్రమించి 'సామ్రాజ్యవాదం' వంటి అంశాలను చర్చించడానికి పూనుకుంటే అందుకు వారు భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుంది. అందుచేత చాలామంది ఆర్థిక శాస్త్ర పండితులు ఆ పరిధులకు లోబడే నడుచుకోడానికి నిర్ణయించుకుంటారు. ఆ 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' అనేదానిలోనే సామ్రాజ్యవాదం అన్న విషయం కనిపించదు కనుక వారు దాని ఊసు ఎత్తరు. అంతే తప్ప వారంతా నిజాయితీ లేని పండితులు అని, కావాలనే వారంతా అలా వ్యవహరిస్తున్నారని మనం అనుకోవద్దు.

ఒకటి, రెండు ఉదాహరణలతో ఈ విషయాన్ని బాగా గ్రహించవచ్చు. మొదటిది ఆర్థికవృద్ధికి సంబంధించిన సిద్ధాంతం. 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' పెట్టుబడిదారీ సమాజంలో శ్రామికజనం వృద్ధి చెందే రేటుతో ఆ సమాజపు ఆర్థికవృద్ధిని ముడిపెట్టి చూస్తుంది. అంటే ఆ సమాజంలో జనాభా సహజంగా పెరిగే రేటుతో అది ముడిపడి వుంటుందని భావిస్తుంది.

ఈ దృక్పథంలో ఉన్న లోపం ఏమంటే అది సమాజం మొత్తంగా ఉన్న డిమాండ్ తాలూకు పాత్రను అది గుర్తించదు. ఆ దృక్పథం 'సే' సూత్రాన్ని విశ్వసిస్తుంది. సమాజంలో ఎంత ఉత్పత్తి అవుతుందో అదంతా చెల్లుబాటు అయిపోతుంది అని 'సే' సూత్రం అంటుంది. ఎక్కడైనా సూక్ష్మ స్థాయిలోనో, తాత్కాలికంగానో డిమాండ్ కొరత రావచ్చునేమో తప్ప మొత్తం మీద మార్కెట్‌లో ఎంత ఉత్పత్తి వస్తుందో అంత మేరకు సరిపడా డిమాండ్ ఉంటుందని ఆ సూత్రం చెప్తుంది. కాని ఇది చారిత్రికంగా చూసినప్పుడు వాస్తవం కాదు.

అమెరికా, కెనడా వంటి 'కొత్త ప్రపంచపు' దేశాలలో పెట్టుబడిదారీ విధానం నడవడానికి కావలసిన శ్రామిక జనాన్ని అందించడం కోసం 19 వ శతాబ్దం వరకూ (1900 వరకూ) దాదాపు రెండు కోట్లమంది ప్రజలను ఆఫ్రికా నుండి బానిసలుగా పట్టి తెచ్చి నియోగించారు. వారిచేత గనుల్లో, తోటల్లో పని చేయించారు. అదే విధంగా భారతదేశం నుండి, చైనా నుండి దాదాపు 5 కోట్ల మంది శ్రామికులను ముందస్తు ఒప్పందాలు కుదుర్చుకుని ఆ కొత్త ప్రపంచానికి తరలించారు. ఇది దాదాపు మొదటి ప్రపంచ యుద్ధం దాకా కొనసాగింది (అంతకు ముందే యూరప్ నుంచి దాదాపు 5 కోట్ల మంది ప్రజానీకం ఇష్టపూర్వకంగానే కొత్త ప్రపంచానికి వలసలు వచ్చారు. ఆ కొత్త ప్రపంచంలో అంతవరకూ జీవిస్తున్న స్థానికులను వారి ఆవాసాల నుండి తరిమివేసి ఆ భూములను ఆక్రమించుకున్నారు).

పెట్టుబడిదారీ విధానం విస్తరణ క్రమంలో ఇంత భారీ స్థాయిలో జనాభా ఒక దగ్గరి నుండి మరొక చోటికి తరలించబడడం అనేది 'ప్రధాన స్రవంతి ఆర్థిక సిద్ధాంతం' చెప్పే వృద్ధి సిద్ధాంతానికి పూర్తిగా భిన్నంగా జరిగింది. జనాభా సహజ వృద్ధి మీద ఆధారపడి ఆర్థిక వృద్ధి జరుగుతుందనే ఆ సిద్ధాంతం ఇక్కడ వర్తించలేదు. ఐనప్పటికీ, వాళ్ళు ఇప్పటికీ అదే వృద్ధి సిద్ధాంతాన్ని ప్రవచిస్తున్నారు.

ఒకవేళ 'సామ్రాజ్యవాదం' అనేది లేకపోయినట్టైతే ఈ వృద్ధి సిద్ధాంతం చెల్లుతుంది కదా అనే వాదన చేసినవాళ్ళూ ఉన్నారు. ఆస్ట్రియాకు చెందిన ఆట్టో బేయర్ అనే మార్క్సిస్టు ఈ విధమైన వాదనలనే చేశాడు. కాని పెట్టుబడిదారీ విధానం తన అవసరాల కోసం సాగించిన భారీ స్థాయి జనాభా తరలింపులను అతను గుర్తించనేలేదు.

"21వ శతాబ్దంలో పెట్టుబడి" అనే గ్రంథాన్ని 2013లో రచించిన థామస్ పికెటీ సైతం చారిత్రకంగా ఖండాంతరాలను దాటి జరిగిన శ్రామిక జనుల నిర్బంధ తరలింపును తన సిద్ధాంతంలో పరిగణనలోకి తీసుకోలేదు.

ఇక రెండో ఉదాహరణ స్వేచ్ఛా వాణిజ్యానికి సంబంధించిన సిద్ధాంతం. స్వేచ్ఛా వాణిజ్యం ద్వారా ప్రతీ దేశమూ ప్రయోజనం పొందుతుంది అని ఈ సిద్ధాంతం చెప్తుంది. ప్రతీ దేశంలోనూ ఉత్పత్తి విధానంలో ఉండే అన్ని అంశాలూ (పరిశ్రమలు పూర్తి కెపాసిటీ మేరకు నడవడం, ముడిసరుకులు పూర్తి స్థాయిలో సరఫరా కావడం, కార్మికులు పూర్తి స్థాయిలో పనుల్లో నియోగించబడడం వగైరా) పూర్తి వినియోగంలో ఉంటాయన్నది ఈ సిద్ధాంతానికి ప్రాతిపదిక. స్వేచ్ఛా వాణిజ్యానికి అనుమతినిచ్చిన తర్వాత కూడా ఉత్పత్తి విధానంలోని అన్ని అంశాలూ పూర్తి స్థాయిలో వినియోగించబడుతూనే వుంటాయని, ఐతే, ఏ దేశం ఏ యే ఉత్పత్తులు చేస్తుందనేది మాత్రం మారుతుందని ఈ సిద్ధాంతం భావిస్తుంది. ప్రతీ దేశమూ తన వనరులను వినియోగించుకుంటూ మొత్తం ప్రపంచ మార్కెట్‌కు తగినట్టు పూర్తి స్థాయిలో ఉత్పత్తిని చేపడుతుందని, వివిధ దేశాల మధ్య పరస్పర సహకారం ఏర్పడుతుందని, దాని వలన అన్ని దేశాలూ వృద్ధి చెందుతాయని ఈ సిద్ధాంతం భావిస్తుంది. పరస్పర పోటీలో నిలదొక్కుకోగలిగినవారే మిగులుతారనే పోటీ సిద్ధాంతాన్ని అది తిరస్కరిస్తుంది.

ఐతే ఇలా అన్ని దేశాలూ పూర్తి స్థాయిలో ఉత్పత్తిని చేపట్టగలగాలంటే ఆ ఉత్పత్తిని అంతటినీ పూర్తిగా వినియోగించగలిగే డిమాండ్ ఉండి వుండాలి. కాని ప్రపంచం మొత్తం మీద ఎంత డిమాండ్ ఉంటుందో అంతమేరకే ఉత్పత్తిని చేపట్టడం జరుగుతుంది కాని అందుకు భిన్నంగా కాదు. ఉన్న డిమాండ్‌కు మించి ఉత్పత్తి చేస్తే ఆ సరుకులు చెల్లుబాటు కాకుండా మిగిలిపోతాయి. అందుచేత ఒకానొక దేశంలో గనుక ఉత్పత్తి పెరిగితే, అది మరొక దేశంలో ఉత్పత్తి తగ్గిపోడానికి దారితీస్తుంది. అంటే స్వేచ్ఛా వాణిజ్యం ఫలితంగా అన్ని దేశాలూ వృద్ధి చెందుతాయనే వాదన చెల్లదు. కొన్ని దేశాలు బాగుపడడానికి మరికొన్ని దేశాల పరిస్థితులు దెబ్బ తినవలసిన పరిస్థితులను స్వేచ్ఛా వాణిజ్యం కల్పిస్తుంది. అందుకే వివిధ దేశాల నడుమ మార్కెట్ల మీద పట్టు కోసం పోరాటం జరుగుతూ వుంటుంది. ఇలా మార్కెట్లమీద అదుపు సాధించే లక్ష్యమే సామ్రాజ్యవాదం అనే స్వభావానికి మూలం. వాణిజ్యం అనేది ఒక పోరాటంగా చూడడం బదులు. అది పరస్పర సహకారంతో జరుగుతుందని చెప్పడం ద్వారా 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' సామ్రాజ్యవాదం అనే లక్షణాన్ని పూర్తిగా మరుగుపరుస్తుంది.

స్వేచ్ఛా వాణిజ్యం ఫలితంగా అన్ని దేశాలూ వృద్ధి చెందుతాయనే వాదన చెల్లదు. కొన్ని దేశాలు బాగుపడడానికి మరికొన్ని దేశాల పరిస్థితులు దెబ్బ తినవలసిన పరిస్థితులను స్వేచ్ఛా వాణిజ్యం కల్పిస్తుంది. అందుకే వివిధ దేశాల నడుమ మార్కెట్ల మీద పట్టు కోసం పోరాటం జరుగుతూ వుంటుంది. ఇలా మార్కెట్లమీద అదుపు సాధించే లక్ష్యమే సామ్రాజ్యవాదం అనే స్వభావానికి మూలం. వాణిజ్యం అనేది ఒక పోరాటంగా చూడడం బదులు. అది పరస్పర సహకారంతో జరుగుతుందని చెప్పడం ద్వారా 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' సామ్రాజ్యవాదం అనే లక్షణాన్ని పూర్తిగా మరుగుపరుస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించే సిద్ధాంతవేత్త అయినప్పటికీ జాన్ మేనార్డ్ కీన్స్ ఈ మార్కెట్ల కోసం దేశాల నడుమ జరిగే పోరాటాన్ని గుర్తించాడు. అందుకే అతడు 'సే' సూత్రాన్ని తిరస్కరించాడు. ఒకానొక దేశం తన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకోవాలంటే మార్కెట్ల కోసం పోటీ పడవలసిందేనని అతడు తెలిపాడు. అటువంటి పోటీని తట్టుకోవాలంటే దేశీయ మార్కెట్ లోని డిమాండ్‌ను బలోపేతం చేయాల్సి వుంటుందని, పూర్తి స్థాయిలో అందరికీ ఉపాధి కల్పించేవిధంగా ప్రభుత్వం జోక్యం కల్పించుకున్నప్పుడే దేశీయ డిమాండ్ బలపడుతుందని కీన్స్ ప్రతిపాదించాడు. అదే విధంగా దేశీయ మార్కెట్‌ను, ఉత్పత్తిదారులను, అంతర్జాతీయ పోటీ తాకిడి నుండి కాపాడడానికి సైతం ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని అతను చెప్పాడు. అంటే స్వేచ్ఛా వాణిజ్యం ప్రయోజనకరం అనే సిద్ధాంతాన్ని అతడు తిరస్కరించడాన్నమాట.

కాని ఇప్పటికీ, స్వేచ్ఛా వాణిజ్యం సిద్ధాంతాన్ని చిలక పలుకుల్లా వల్లించేవారు ఉన్నారు. వారంతా మార్కెట్ మొత్తం మీద డిమాండ్‌కు ఏర్పడే కొరతను పరిగణనలోకి తీసుకోరు. అందువలన మార్కెట్ కోసం అనివార్యంగా తీవ్రమైన పోటీ ఉంటుందనే వాస్తవాన్ని వారు గుర్తించలేక పోతున్నారు. ఆ పోటీ సామ్రాజ్యవాదానికి దారి తీస్తుందని వారు గుర్తించరు. నిజానికి సామ్రాజ్యవాదం అనే ధోరణిని కప్పిపుచ్చడానికే వాళ్ళు స్వేచ్ఛా వాణిజ్యం సిద్ధాంతాన్ని ముందుకు తెస్తున్నారు. దానిని సమర్థించుకోడానికి కాలం చెల్లిన 'సే' సూత్రాన్ని జపిస్తున్నారు.

మూడవ ప్రపంచ దేశాలలో పరిశ్రమలను వలస పాలన కాలంలో నాశనం చేయడం, ఆ దేశాలకు తమ పారిశ్రామిక సరుకులను పెద్దఎత్తున దింపి మార్కెట్‌ను చేజిక్కించుకోవడం చారిత్రిక వాస్తవం. కాని, ఈ చారిత్రిక అనుభవాన్ని కూడా స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతకారులు గుర్తించరు. అందుచేత మూడవ ప్రపంచ దేశాలలో నెలకొన్న పేదరికానికి మూలం సామ్రాజ్యవాదుల దోపిడీయే అన్న సత్యాన్ని, సంపన్న దేశాలతో వాణిజ్యం నిజానికి మూడవ ప్రపంచ దేశాలకు ప్రతికూలంగా ఉంటుందనే సత్యాన్ని వారు కప్పిపుచ్చే పనిలో ఉన్నారు.

అందుకే ఈ 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' అనేది నిష్పాక్షికమైనదేమీ కాదు. అది సామ్రాజ్యవాద దోపిడీని కప్పిపుచ్చే సైద్ధాంతిక మాయాజాలం.

(స్వేచ్ఛానుసరణ)

> **"మూడవ ప్రపంచ దేశాలలో పరిశ్రమలను వలస పాలన కాలంలో నాశనం చేయడం, ఆ దేశాలకు తమ పారిశ్రామిక సరుకులను పెద్దఎత్తున దింపి మార్కెట్‌ను చేజిక్కించుకోవడం చారిత్రిక వాస్తవం. కాని, ఈ చారిత్రిక అనుభవాన్ని కూడా స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతకారులు గుర్తించరు. అందుచేత మూడవ ప్రపంచ దేశాలలో నెలకొన్న పేదరికానికి మూలం సామ్రాజ్యవాదుల దోపిడీయే అన్న సత్యాన్ని, సంపన్న దేశాలతో వాణిజ్యం నిజానికి మూడవ ప్రపంచ దేశాలకు ప్రతికూలంగా ఉంటుందనే సత్యాన్ని వారు కప్పిపుచ్చే పనిలో ఉన్నారు. అందుకే ఈ 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' అనేది నిష్పాక్షికమైనదేమీ కాదు. అది సామ్రాజ్యవాద దోపిడీని కప్పిపుచ్చే సైద్ధాంతిక మాయాజాలం."**

అంతర్జాతీయం

అమెరికా అధ్యక్ష పీఠం ఎవరిదో!

వి.బి. పరమేశ్వరన్

పది మందిలో ఎనిమిది మంది చెబుతున్న ధరల పెరుగుదలను నియంత్రించే ఎలాంటి నిర్దిష్ట హామీని ట్రంప్ కానీ, హారిస్ కానీ ఇవ్వలేకపోయారు. అలాగే గాజాలో జరిగిన మారణహోమానికి తిరుగులేని మద్దతు ఇచ్చినందుకు కమలా హారిస్ చాలా విమర్శలను ఎదుర్కొంటున్నారు. కమలా హారిస్ ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, డబ్బుతో సహాయం చేస్తున్న ప్రభుత్వంలో భాగం, యు.ఎస్ మిలిటరీని అత్యంత అద్భుతమైన మిలిటరీగా నిర్మించాలనుకుంటున్నట్లు ట్రంప్‌తో చర్చలో ఆమె అన్నారు. అమెరికా సామ్రాజ్య ప్రయోజనాలను వదులుకోవడానికి కమలా హారిస్ సిద్ధంగా లేరని దీనినిబట్టి అర్థమవుతోంది. అయితే ట్రంప్ ఫాసిస్ట్ ముఖాన్ని చీల్చి చెండాడే అవకాశాన్ని కమలా హారిస్ ఎప్పుడూ వృథా చేయలేదు. ట్రంప్ విధానాలు అస్థిరంగా ఉన్నాయని, అనూహ్యంగా ఉన్నాయని విమర్శించారు. మరి అమెరికాకు మహిళ నాయకత్వం వహిస్తుందా లేదా ట్రంప్‌కు రెండోసారి అధికారం దక్కుతుందా అనేది నేడు (నవంబర్ ఐదున) అమెరికన్లు తీర్పు ఇవ్వనున్నారు.

అమెరికాలో అరవయ్యవ అధ్యక్ష ఎన్నికలు మంగళవారం జరగనున్నాయి. ప్రస్తుత ఉపాధ్యక్షురాలు, డెమొక్రటిక్ పార్టీ నాయకురాలు కమలా హారిస్, మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మధ్య ప్రధాన పోటీ నెలకొని ఉంది. గ్రీన్ పార్టీకి చెందిన జిల్ స్టెయిన్, మరి కొంతమంది స్వతంత్రులు ఎన్నికల బరిలో నిలిచారు. అధ్యక్షుడు జో బైడెన్ ఉపసంహరణ తర్వాత, డెమొక్రటిక్ పార్టీ భారతీయ సంతతికి చెందిన ఆఫ్రో-అమెరికన్ మహిళ కమలా హారిస్‌ను డెమొక్రటిక్ అభ్యర్థిగా నామినేట్ చేసిన సంగతి తెలిసిందే. 2016లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌పై విజయం సాధించి ట్రంప్ అధ్యక్షుడయ్యారు. ఈసారి కమలా హారిస్‌ను సులువుగా ఓడించగలనని ట్రంప్ పేర్కొన్నారు, అయితే పోటీ తీవ్రంగా ఉంది.

ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ కమలా హారిస్‌కు మద్దతు తగ్గడం, ట్రంప్ ఊపందుకోవడం డెమొక్రటిక్ పార్టీని ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం కమలా హారిస్‌కు 48 శాతం మద్దతు ఉండగా, ట్రంప్‌కు 47 శాతం మద్దతు ఉంది. వారం క్రితం వరకు కమలా హారిస్ 2.2 శాతం ఆధిక్యంలో ఉన్నారు. 2020లో బైడెన్ ట్రంప్ కంటే 8.9 శాతం ఆధిక్యంలో ఉన్నారు. ది హిల్, ఎన్.బి.సి న్యూస్, న్యూయార్క్ పోస్ట్ మరియు ఎం.ఎస్.ఎన్ అన్నీ కమలా హారిస్ విజయంపై అనుమానాలు వ్యక్తం చేశాయి. వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రకారం ట్రంప్ 3 శాతం ముందంజలో ఉన్నారు. మరోవైపు కమలా హారిస్ మూడు శాతంతో ముందంజలో ఉన్నట్లు రాయిటర్స్ పేర్కొంది. అంటే పోటీ తీవ్రంగా ఉందని అర్థం.

ఏడు స్వింగ్ రాష్ట్రాలు ఎటువైపు మొగ్గుతాయి అనేదానిపై ఇరు పార్టీల జయాపజయాలు ఆధారపడి ఉన్నాయి. మూడు రాష్ట్రాలను యుద్ధ భూమి (బ్యాటిల్ ఫీల్డు)గా పరిగణిస్తారు. అధ్యక్ష ఎన్నికల్లో విజేతను ప్రతి రాష్ట్రంలో గెలుపొందిన ఎలక్టోరల్ కాలేజీ సీట్లే నిర్ణయిస్తాయి. అంతే తప్ప దేశవ్యాపితంగా లభించిన ఓట్లు కాదు. 538 మంది సభ్యుల ఎలక్టోరల్ కాలేజీలో 270 సీట్లు పొందిన వ్యక్తి చివరకు ఎన్నికవుతారు. ఉదాహరణకు, 2014 ఎన్నికలలో, హిల్లరీ క్లింటన్ ట్రంప్ కంటే 20 లక్షల ఓట్లు ఎక్కువగా పొందారు. అయితే ట్రంప్ ఎలక్టోరల్ కాలేజీలో ఎక్కువ సీట్లు గెలుచుకున్నందున, అతను అధ్యక్షుడయ్యాడు. ప్రస్తుతం, కమలా హారిస్, ట్రంప్ ఎలక్టోరల్ కాలేజీలో సగటున 200 సీట్లు గెలుచుకోవడం ఖాయంగా అనిపిస్తుంది. మెజారిటీ రాష్ట్రాలు సాంప్రదాయకంగా రిపబ్లికన్, డెమొక్రాట్లకు ఓటు వేస్తాయి. ఉదాహరణకు, కమలా హారిస్ రాష్ట్రమైన కాలిఫోర్నియా డెమొక్రటిక్ పార్టీకి అండగా నిలుస్తుంది. ఈ రాష్ట్రంలో డెమోక్రాట్లు ఆధిక్యంలోకి వస్తే, ఆ రాష్ట్రంలోని మొత్తం 54 ఎలక్టోరల్ కాలేజీ సీట్లను డెమొక్రటిక్ పార్టీ కైవసం చేసుకుంటుంది. అదేవిధంగా ట్రంప్ సొంత రాష్ట్రమైన ఫ్లోరిడా కూడా ఎప్పుడూ రిపబ్లికన్ పార్టీకే మొగ్గు చూపుతోంది. దీని ప్రకారం రెండు పార్టీలకు 200 సీట్లు రావడం ఖాయమని అంటున్నారు. మిగిలిన 70 సీట్లు సాధించడం ముఖ్యం. ఏడు స్వింగ్ రాష్ట్రాలపైనే అందరి దృష్టి. స్వింగ్ రాష్ట్రాల్లో పెన్సిల్వేనియా, మిచిగాన్, నార్త్ కరోలినా, విస్కాన్సిన్, జార్జియా, అరిజోనా, నెవాడా ఉన్నాయి. పెన్సిల్వేనియా, విస్కాన్సిన్, మిచిగాన్‌లను మూడు యుద్ధ భూమి రాష్ట్రాలు అని పిలుస్తున్నారు. ఇందులో పెన్సిల్వేనియాలో ట్రంప్‌కు స్వల్ప ఆధిక్యత లభించడం డెమోక్రాట్లకు గుబులు పుట్టిస్తోంది. 2016లో, ట్రంప్ ఆధిక్యంలో ఉన్నప్పుడు ఈ మూడు రాష్ట్రాల్లో విజయం సాధించారు. 2020లో బైడెన్ ఈ మూడు రాష్ట్రాల్లో ఆధిక్యం సాధించి అధ్యక్షుడయ్యారు. యువ ఓటర్లలో కమలా హారిస్ కంటే ట్రంప్ 21 పాయింట్ల ఆధిక్యంలో ఉన్నారు. అయితే మహిళా ఓటర్లలో ట్రంప్‌పై కమలా హారిస్ 39 పాయింట్ల ఆధిక్యంలో ఉన్నారు (న్యూయార్క్ టైమ్స్ /సియెన్నా పోల్). పురుష ఓటర్లు సాధారణంగా ట్రంప్‌ను ఆమోదిస్తారు. కానీ వలస వచ్చిన వారిలో లాటినోల తర్వాత 60 శాతం మంది భారతీయ-అమెరికన్ ఓటర్లు కమలా హారిస్‌కు మద్దతు ఇస్తున్నారు.

ఇమ్మిగ్రేషన్, అబార్షన్ హక్కులు, ఆర్థిక వ్యవస్థ, యుద్ధాలు కీలకమైన ఎన్నికల సమస్యలతో డెమోక్రాట్లకు మద్దతు ఇచ్చే భారతీయ-అమెరికన్ల సంఖ్య యేటా తగ్గుతూ వస్తోంది. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని ట్రంప్ వాదించారు. బైడెన్ పరిపాలనలో అక్రమ వలసలు పెరిగాయని ట్రంప్ వాదించారు. అమెరికాలో వుంటున్న విదేశీయుల్లో 25 శాతం మంది అక్రమ వలసదారులు. వారిలో ఎక్కువ మంది మెక్సికో ద్వారా వచ్చే లాటినోలు. కమలా హారిస్ లేదా డెమోక్రాట్లు ఈ సమస్యపై ప్రత్యామ్నాయాన్ని చూపలేకపోయారు. అక్రమ వలసలను క్రిమినల్ నేరంగా పరిగణించాలని కమలా హారిస్ కూడా అంటున్నారు.. కమలా హారిస్ అబార్షన్ చేసుకునే మహిళల హక్కును రక్షించే ముఖ్యమైన అంశాన్ని లేవనెత్తారు. కానీ 1970లలో ఈ అంశానికి ఉన్న ప్రాముఖ్యత ఇప్పుడు అమెరికన్ సమాజంలో లేదు. అందువల్ల డెమోక్రాట్లకు మునుపటిలా ఓట్లు రాబట్టేందుకు ఈ అంశం ఉపకరించదని నిపుణులు భావిస్తున్నారు.

కార్మిక సంఘాలు కమలా హారిస్ గతంలో 15 డాలర్ల కనీస వేతనం, కార్మికుల సంఘటిత హక్కు కోసం మాట్లాడారు. ఇప్పుడు ఆమె సామాజిక న్యాయ నినాదాలను విడనాడి మితవాదం వైపునకు మొగ్గినట్లు అనిపిస్తోంది.

ట్రంప్‌ది పూర్తిగా కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానమైతే, కమలా హారిస్ కొన్ని దిద్దుబాట్లకు సిద్ధంగా ఉన్నారు. కమలా హారిస్ సంపన్నులపై పన్ను విధిస్తానని, మధ్యతరగతి వారికి పన్ను మినహాయింపులు ఇస్తానని హామీ ఇచ్చారు. అయితే పది మందిలో ఎనిమిది మంది చెబుతున్న ధరల పెరుగుదలను నియంత్రించే ఎలాంటి నిర్దిష్ట హామీని ట్రంప్ కానీ, హారిస్ కానీ ఇవ్వలేకపోయారు. అలాగే గాజాలో జరిగిన మారణహోమానికి తిరుగులేని మద్దతు ఇచ్చినందుకు కమలా హారిస్ చాలా విమర్శలను ఎదుర్కొంటున్నారు. కమలా హారిస్ ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, డబ్బుతో సహాయం చేస్తున్న ప్రభుత్వంలో భాగం, యు.ఎస్ మిలిటరీని అత్యంత అద్భుతమైన మిలిటరీగా నిర్మించాలనుకుంటున్నట్లు ట్రంప్‌తో చర్చలో ఆమె అన్నారు. అమెరికా సామ్రాజ్య ప్రయోజనాలను వదులుకోవడానికి కమలా హారిస్ సిద్ధంగా లేరని దీనిని బట్టి అర్థమవుతోంది. అయితే ట్రంప్ ఫాసిస్ట్ ముఖాన్ని చీల్చి చెండాడే అవకాశాన్ని కమలా హారిస్ ఎప్పుడూ వృథా చేయలేదు. ట్రంప్ విధానాలు అస్థిరంగా ఉన్నాయని, అనూహ్యంగా ఉన్నాయని విమర్శించారు. మరి అమెరికాకు మహిళ నాయకత్వం వహిస్తుందా లేదా ట్రంప్‌కు రెండోసారి అధికారం దక్కుతుందా అనేది నేడు (నవంబర్ ఐదున) అమెరికన్లు తీర్పు ఇవ్వనున్నారు.

/ 'దేశాభిమాని' సౌజన్యంతో/

జనవాక్యం

జాతకాలు, జ్యోతిష్యాలు మోసం

మొన్న తెలంగాణ హైకోర్టు మంచి తీర్పు చెప్పింది. టాలీవుడ్ హీరో కుమారుడి వివాహానికి సంబంధించి ఆ బంధం ఎక్కువ కాలం నిలవదని, విడాకులు తీసుకుంటారని చెప్పిన వేణుస్వామి పైన వారు మహిళా కమిషన్‌కు వెళ్లగా, మహిళా కమిషన్ వేణుస్వామిపై చర్యలకు ఆదేశించింది. ఈ విషయమై వేణు హైకోర్టుకు వెళ్లగా నిన్న మహిళా కమిషన్ ఆదేశించిన చర్యలను సమర్థిస్తూ తీర్పు చెప్పింది. జాతకాల పేరుతో, జ్యోతిష్యం పేరుతో మోసం చేసేవారికి ఈ తీర్పు ఒక గుణపాఠం కాగలదు. ఇదే వేణుస్వామి గత ఎన్నికల సమయంలో తెలంగాణలో కెసిఆర్ మూడోసారి గెలుస్తారని చాలెంజ్ చేశాడు. ఇక్కడ జగన్ గెలుస్తారని కూడా సవాల్ చేశాడు. రెండు చోట్లా ఆయన చెప్పిన జాతకం తిరగబడింది. ప్రపంచంలోనే జ్యోతిష్యం నిజమని ఇంతవరకూ రుజువు కాలేదు. 1975లో ప్రపంచం లోని వివిధ రంగాల శాస్త్రజ్ఞులు 192 మంది జ్యోతిష్యం అబద్ధం, బూటకం అని చెప్పారు. వీరిలో 17 మంది నోబెల్ బహుమతి గ్రహీతలు. అమెరికన్ హేతువాది జేమ్స్ రాండి ప్రపంచంలోని జ్యోతిష్కులను సవాల్ చేశాడు. మీ జ్యోతిష్యం నిజమని నిరూపిస్తే రూ.5 కోట్ల బహుమతి ఇస్తానని 40 సంవత్సరాల నుండి సవాల్ చేస్తున్నాడు. ఒక్కరూ ముందుకు రాలేదు. ప్రజల అమాయకత్వం వలన జాతకాల పేరుతో, జ్యోతిష్యం పేరుతో మోసం చేసే ఆవారాగాళ్ళు పెరిగిపోయారు. కనుక వేణు స్వామికి మహిళా కమిషన్ విధించిన శిక్షను, తెలంగాణ హైకోర్టు తీర్పుని దృష్టిలో పెట్టుకుని...ఇలాంటి మోసకారుల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

కేరళ, పంజాబ్, యుపిలో 14 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నిక తేదీ మార్పు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

కేరళ, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 14 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 13న నిర్వహించాల్సిన ఉప ఎన్నికలను ఈ నెల 20కి వాయిదా వేసినట్లు కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) గతంలో ప్రకటించింది. ఆ రోజున పలు మతపరమైన కార్యక్రమాల కారణంగా బిజెపి, కాంగ్రెస్, బిఎస్‌పి, ఆర్ఎల్‌డి సహా పలు రాజకీయ పార్టీలు పోలింగ్‌ను వాయిదా వేయాలని ఇసిఐని కోరాయి. సాంస్కృతిక, మతపరమైన కార్యక్రమాల కారణంగా ఓటింగ్ శాతం తగ్గే అవకాశం ఉందని రాజకీయ పార్టీలు దృష్టికి తేవడంతో, వాటి అభ్యర్థన మేరకు ఉప ఎన్నికల పోలింగ్‌ను ఈ నెల 20కు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ప్రభావితమైన 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేరళలోని పాలక్కాడ్, పంజాబ్‌లోని డేరా బాబా నానక్, చబ్బేవాల్, గిద్దర్ బాహా, బర్నాల్, ఉత్తరప్రదేశ్‌లోని ఖైర్, మీరాపూర్, కుందర్కి, ఘజియాబాద్, కర్హాల్, సిషామౌ, ఫుల్‌పూర్, కతేహరి, మజావాన్ ఉన్నాయి.

యుపిలో జర్నలిస్టులపై దారుణాలు

- వారం రోజుల్లోనే ఒకరి హత్య
- మరో ఇద్దరిపై హింసాత్మక దాడి
- పత్రికా స్వేచ్ఛను కాపాడండి : మీడియా సంస్థలు, ప్రతినిధుల డిమాండ్

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల కాలంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయి. వారం రోజుల వ్యవధిలో ఇద్దరు జర్నలిస్టులు హత్యకు గురయ్యారు. దీంతో యుపిలో పత్రికా స్వేచ్ఛపై మీడియా సంస్థలు, జర్నలిస్టులు ఆందోళన వ్యక్తం చేశారు. అక్టోబరు 30వ తేదీ అర్ధరాత్రి ఫతేపూర్ జిల్లాలో ఒక జర్నలిస్టు హత్యకు గురయ్యాడు. అక్టోబరు 27న హమీర్‌పూర్ జిల్లాకు చెందిన ఇద్దరు జర్నలిస్టులను అక్కడి పంచాయితీ చైర్మన్, ఆయన అనుచరగణం బట్టలూడదీసి, బాదారు. జర్నలిస్టు దిలీప్ సైని హత్యకు ఆస్తి తగాదాలే కారణమని పోలీసులు కేసును తప్పుదారి పట్టించే యత్నం చేశారు. సరిళా నగర్ పంచాయితీ చైర్మన్ పవన్ అనురాగి, ఆయన అనుచరులు తమపై హింసాత్మక దాడులకు పాల్పడ్డారని హమీర్‌పూర్‌కి చెందిన ఇద్దరు జర్నలిస్టులు అమిత్ ద్వివేది, శైలేంద్ర కుమార్ మిశ్రా పేర్కొన్నారు. అనురాగి మనుషులు లైట్లు ఆర్పేసి చీకట్లో తమను చావబాదారని, తుపాకీతో బెదిరించి బట్టలూడదీయించారని వారు వాపోయారు.. అవమానకరమైన ఆ సంఘటనలను వీడియో తీశారని, పైగా మూత్రం తాగాలంటూ తమపై ఒత్తిడి తెచ్చారని చెప్పారు. తమ ఫోన్లను లాక్కున్నారని, తమను బందీలుగా వుంచారని జరియా పోలీస్ స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యతీసుకోవాల్సిన పోలీసులు బాధితులనే దోషులుగా చిత్రీకరించేందుకు యత్నించారు. ఆ ఇద్దరు జర్నలిస్టులపై తప్పుడు కేసులు బనాయించారు.

ఈ దాడులను యుపి అక్రిడిటేటెడ్ కరస్పాండెంట్స్ కమిటీ (యుపిఎసిసి) ఖండించింది. ఇందుకు బాధ్యులైనవారిపై తక్షణమే చర్య తీసుకోవాలని కమిటీ అధ్యక్షుడు హేమంత్ తివారీ విజ్ఞప్తి చేశారు.

మహారాష్ట్ర డిజిపి బదిలీ

ముంబయి : మహారాష్ట్ర డిజిపి రష్మీ శుక్లాను తక్షణమే బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఆమె బిజెపికి అనుకూలంగా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారన్న కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాల ఫిర్యాదు మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. అత్యంత సీనియర్ అయిన మరో అధికారికి వెంటనే బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. నూతన డిజిపి నియామకం కోసం మంగళవారం మధ్యాహ్నానికి ముగ్గురు ఐపిఎస్ అధికారుల పేర్లు పంపాలని సూచించింది.

ఇ- వేలం నోటీసు
(వరద నీటితో ప్రభావితమైన రెడీమేడ్ వస్త్రాల స్టాక్)

వరద నీటితో **మెసెర్స్.ట్విలిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్** (సర్వే నిర్వహించేది : (డి.సోమశేఖరరావు) కు చెందిన రెడీమేడ్ వస్త్రాల స్టాక్‌పై ప్రభావం చూపించింది ఖచ్చితంగా "ఎక్కడ ఉంది" ఆధారంగా, 'ఏక మొత్తం ఆధారంగా' ఆసక్తిగల కొనుగోలుదారుల నుండి ఇ- వేలం ఫారమ్‌లు ఆహ్వానించడమైనది. పై పదార్థాల నివృత్తిని సర్వే నం.172/ఎ, శ్రీ శక్తి ఫంక్షన్ హాల్ లేన్, కానూరు డొంక రోడ్డు, ఎనకేపాడు, విజయవాడ-521108లో శ్రీ. నితిన్ కుమార్ -8810331841 నుండి ముందస్తు అపాయింట్‌మెంట్ తీసుకున్న తర్వాత **(06.11.2024 నుండి 10.11.2024)** మధ్య తనిఖీ చేయవచ్చు. **11.11.2024**న ఇ వేలం నిర్వహించబడును. ఇ వేలం ఫారముల కొరకు శ్రీ. ఖుషి, మొ.-9990857386 ను సంప్రదించగలరు.

సాల్వోర్ సెట్టిలర్స్ ప్రైవేట్ లిమిటెడ్
(వేలం నిర్వహించేవారు)

చిరునామా : 203, 2వ అంతస్తు, ఉషా కిరణ్ బిల్డింగ్, అజాద్‌పూర్ కమర్షియల్ కాంప్లెక్స్, ఢిల్లీ-110033 లేదా వెబ్‌సైట్ : **www.salvorsettlers.com** నుండి డౌన్లోడ్ చేసుకోగలరు. ఇ -వేలం ఫారములు సమర్పించుటకు చివరి తేది : 11.11.2024, మ.12.30 గం. కు ముందు

A.P. CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

NIT No. MAU61-US1OUS(OTH)/18/2024-TT Dt. 01.11.2024

E PROCUREMENT TENDER NOTICE

Name of Work: "Providing Furniture to the Unit Offices- "Providing Office Furniture like tables & Revloving chairs (i.e.Midback and High back chairs) to the Unit offices under APCRDA"– **Estimate Amount: Rs. 22,10,000/-.**

The bid can be downloaded on AP e-procurement portal from **05.11.2024 to 20.11.2024 up to 14.00 Hrs.** Due date for submission of Bid **20.11.2024 up to 15.00 Hrs,** Technical bid opening **20.11.2024 @16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Chief Engineer (T&T), APCRDA, Vijayawada

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ

ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు

నెం.**57/2024-25,** తేదీ : **01.11.2024**

కార్యనిర్వాహక ఇంజనీరు, డ్రైనేజి డివిజన్, గుడివాడ పరిధిలో 2024-25 సంవత్సరానికి ఆపరేషన్ మరియు నిర్వహణ క్రింద "ఐనంపుడి మేజర్ డ్రైన్ కి.మీ. 6.555 కుడిగట్టు మరమత్తులు" చేపట్టుటకు గాను రూ.21.48 లక్షలతో ఆన్‌లైన్ టెండర్లు కోరడమైనది. టెండర్లు ది.04.11.2024, ఉ.11 గం. నుండి 18.11.2024, ఉ.11.00 గం. వరకు www.apeprocurement.gov.in లో పొందవచ్చును.
ఫోన్ : 9553014499

పం/- కార్యనిర్వాహక ఇంజనీరు,
డ్రైనేజ్ డివిజన్, గుడివాడ

DIPRNo.14453/CL/ADVT/1/1/2021-22

11 నుంచి 'అభయ' కేసు విచారణ

- నిందితుడిపై అభియోగాల ప్రక్రియ పూర్తి

కొల్‌కతా : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కొల్‌కతాలోని ఆర్‌జి కర్ ఆసుపత్రిలో ట్రైనీ డాక్టర్ (అభయ)పై అత్యాచారం, హత్య కేసును ఈ నెల 11 నుంచి కోర్టు విచారించనుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌పై సోమవారం కొల్‌కతాలోని కోర్టులో అభియోగాలు నమోదు ప్రక్రియ పూర్తయింది. నిందితుడ్ని కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసును సిబిఐ దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 64 (అత్యాచారం), 66 (మరణానికి కారణం కావడం), 103 (హత్య) కింద సంజయ్ రాయ్‌పై అభియోగాలు మోపారు. అదనపు జిల్లా జడ్జి సీల్దా ఛాంబర్‌లో రాయ్‌పై అభియోగాలు నమోదు ప్రక్రియ జరిగింది. 28 రోజులు క్రితమే సిబిఐ ఈ కేసులో సిబిఐ ఛార్జిషీట్ కూడా దాఖలు చేసింది. నిందితుడికి వ్యతిరేకంగా 11 సాక్ష్యాధారాల జాబితా కూడా తయారు చేసింది. అభియోగాలను రూపొందించడంతో ఈ కేసు విచారణ ఈ నెల 11 నుంచి రోజువారీ ప్రాతిపదికన ప్రారంభమవుతుందని కోర్టు తెలిపింది.

వక్ఫ్ జెపిసిని బుల్‌డోజ్ చేస్తున్నారు

- చైర్మన్ తీరు మారకుంటే తప్పుకుంటాం
- స్పీకర్‌కు ప్రతిపక్ష ఎంపీల లేఖ

న్యూఢిల్లీ : వక్ఫ్ బిల్లు సవరణలపై విచారణ చేపడుతున్న సంయుక్త పార్లమెంటరీ సంఘం (జెపిసి) ఛైర్‌పర్సన్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ, ప్రతిపక్ష సభ్యుల అభిప్రాయాలను బుల్‌డోజ్ చేస్తున్నారని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. చైర్మన్ తీరు మారకుంటే జెపిసి నుంచి తాము తప్పుకోవడం మినహా మరో మార్గం లేదన్నారు. సోమవారం లోక్‌సభ స్పీకర్‌కు ఈ మేరకు వారు ఒక లేఖ రాశారు. సమావేశ తేదీలు, సంప్రదింపుల కోసం సమన్లు జారీ వంటి అంశాల్లో జెపిసి చైర్మన్, బిజెపి నేత జగదాంబికా పాల్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాసిన లేఖలో పేర్కొన్నారు. చట్టంలో సవరణల మార్పు గురించి రిప్రజెంటేషన్ ఇచ్చేందుకు కూడా తమను అనుమతించడం లేదున్నారు. వక్ఫ్ బిల్లుకు ప్రతిపాదిత మార్పులు ఆగస్టులో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు.

వామపక్ష అభ్యర్థులను గెలిపించండి

- దీపాంకర్ భట్టాచార్య విజ్ఞప్తి

కొల్‌కతా: ఆర్జీ కర్ ఆందోళనల నేపథ్యంలో బెంగాల్‌లోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ (ఎం-లిబరేషన్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలు, ఆకాంక్షలు ఈ ఉప ఎన్నికల్లో ప్రతిబింబించాలన్నారు. రాష్ట్రంలో టిఎంసి అరాచక పాలనకు, బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వాలని ఆయన కోరారు.

ఐరాస శరణార్థుల సంస్థతో కటీఫ్

- ఇజ్రాయిల్ బరితెగింపు
- గాజాను కరువు కాటకాల్లోకి నెట్టడమే లక్ష్యం!
- గాజాలో 33 మంది, లెబనాన్‌లో నలుగురు మృతి
- వెస్ట్ బ్యాంక్‌లో పెరుగుతున్న సెటిలర్ల నేరాలు

గాజా/ బీరుట్/ జెరూసలెం : అమెరికా అండ చూసుకుని ఇష్టానుసారంగా చెలరేగుతున్న ఇజ్రాయిల్ తాజాగా పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేసే ఐక్యరాజ్య సమితి సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ)తో సంబంధాలు తెగదెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. ఇది పరోక్షంగా ఐరాస సంస్థపై యుద్ధం ప్రకటించడమే. ఆ సంస్థను నిషేధించాలంటూ రంకెలు వేస్తున్న యూదు దురహంకార శక్తులను బుజ్జగించేందుకు నెతన్యాహు ఈ నిర్ణయం తీసుకున్నారు. విదేశాంగ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ ఆదేశాల మేరకు, యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎతో ఇజ్రాయిల్‌కు గల ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు తెలియజేశామని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. గతేడాది అక్టోబరు 7నాటి దాడుల్లో యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ ఉద్యోగులు పాల్గొన్నారని, వీరిలో చాలామంది హమాస్ కార్యకర్తలుగా పనిచేస్తున్నారని కట్జ్ ఆరోపించారు. ఈ ఐరాస సంస్థ చాలా కాలంగా పాలస్తీనా శరణార్థులకు, అలాగే పాలస్తీనా భూభాగాల్లోని ప్రజలకు కీలకమైన సాయాన్ని అందజేస్తూ వస్తోంది. తాజా నిర్ణయంతో గాజాకు మానవతా సాయం పూర్తిగా స్తంభించిపోతుంది. దాదాపు గత నెలరోజులుగా ఇజ్రాయిల్ ఆర్మీ దిగ్బంధనంలో వున్న ఉత్తర గాజాలో పరిస్థితులు దయనీయంగా వున్నాయని, తక్షణమే అక్కడి వారికి సహాయం అందేలా చూడాల్సి వుందని జర్మనీ, ఇజ్రాయిల్‌ను కోరింది. గాజాలో ఊచకోతను ఆపడంలో అంతర్జాతీయ సమాజం విఫలం చెందడం వల్లే ఆక్రమిత వెస్ట్ బ్యాంక్ అంతటా సెటిలర్ల నేరాలు పెరుగుతున్నాయని పాలస్తీనా విదేశాంగ శాఖ పేర్కొంది.

గాజాలో 33మంది మృతి

గత 24గంటల్లో గాజాలో ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో 33 మంది మరణించారని, 156మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. సెంట్రల్ గాజాలోని నుస్రత్ శరణార్థ శిబిరంపై, వ్యవసాయ భూముల్లో, నివాస భవనాలపై పలు వైమానిక దాడులు జరిగాయి. గాజాలో మానవతా సాయం సంక్షోభం త్వరలోనే తీవ్రమైన కరువు కాటకాలుగా పెచ్చరిల్లే ప్రమాదముందని ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి) హెచ్చరించింది. దీంతో గాజాలో మృతుల సంఖ్య 43,374కి చేరగా, గాయపడిన వారి సంఖ్య 1,02,261కి చేరింది. కీలకమైనటువంటి మానవతా సాయం అందే ఇటువంటి ప్రాంతాలను దాడుల నుండి మినహాయించాలని డబ్ల్యుహెచ్ఓ సెక్రటరీ జనరల్ టెడ్రోస్ అదనామ్ గెబ్రెయెసెస్ కోరారు.

లెబనాన్‌లో నలుగురు మృతి

బెకా లోయలోని మచ్‌ఘరా పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన దాడిలో నలుగురు మరణించగా, అనేకమంది గాయపడ్డారు. తూర్పు బాల్‌బెక్, దక్షిణ టెబ్‌నిన్ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్పత్రులపై ఇజ్రాయిల్ ఆర్మీ దాడులు జరిపింది. మొత్తంగా 10మంది గాయపడ్డారు. దక్షిణ లెబనాన్‌లోని బారాచిత్ ఏరియాలో హిజ్బుల్లా కమాండర్‌ను హతమార్చామని మిలటరీ ప్రకటించింది.

బాణాసంచాపై శాశ్వత నిషేధం ఎందుకు విధించకూడదు..?

- ఢిల్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : 'ఢిల్లీలో బాణాసంచాపై శాశ్వతంగా నిషేధం ఎందుకు విధించకూడదు' అని ఢిల్లీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. నిషేధం ఉన్నప్పటికీ.. దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడంతో ఢిల్లీలో వాయు కాలుష్యం రికార్డు స్థాయిలో పెరిగిందన్న నిపుణుల కమిటీ నివేదికను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఈ నివేదికపై ఢిల్లీ ప్రభుత్వం, ఢిల్లీ పోలీస్ కమిషనర్ స్పందన కోరింది. వారంరోజుల్లోగా అఫిడవిట్ సమర్పించాలని, ఈ నెల 14న తిరిగి విచారణ చేపడతామని కోర్టు పేర్కొంది. బాణాసంచా కాల్చడంపై 'శాశ్వత నిషేధం' జారీచేయడానికి సంబంధించి ఢిల్లీ ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది. ఢిల్లీలో 2025 జనవరి 1 వరకు అన్ని రకాల బాణాసంచా తయారీ, నిల్వ చేయడం, విక్రయాలు, ఆన్‌లైన్ ద్వారా పంపిణీ, కాల్చడంపై ఢిల్లీ కాలుష్య నియంత్రణ మండలి (డిపిసిసి) నిషేధం విధించిన ఉత్తర్వులను కూడా కోర్టు పరిశీలించింది.

కెనడాలో ఖలిస్తానీ వాదుల దాడి

- ఖండించిన ట్రూడో
- భారత్ నిరసన

ఒట్టావా : కెనడాలోని బ్రాంప్టన్‌లో హిందూ దేవాలయానికి వచ్చిన వారిపై ఖలిస్తాన్ వేర్పాటువాదులు ఆదివారం దాడి చేశారు. దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఖలిస్తానీ జెండాను పట్టుకున్న వ్యక్తులు ఆలయానికి వచ్చిన వారిపై దాడి చేయడం ఆ వీడియోలో కనిపిస్తోంది. ఈ ఘటనను కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఖండించారు. బ్రాంప్టన్‌లోని హిందూ సభ మందిర్ వద్ద చోటు చేసుకున్న ఈ హింసాత్మక ఘటన ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. భారత్, కెనడా మధ్య దౌత్య సంబంధాలు క్షీణించిన తరుణంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

భారత్ వ్యతిరేక శక్తుల పనే ఇది : హై కమిషన్

ఆదివారం నాటి దాడి భారత్ వ్యతిరేక శక్తుల పనేనని హై కమిషన్ వ్యాఖ్యానించింది. కెనడాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా హిందువులకు తగిన భద్రతను కల్పించాలని కెనడా అధికారులను ముందుగానే కోరామని కెనడాలోని భారత హై కమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. భారత హై కమిషన్ నిర్వహించే కాన్సులర్ కేంప్ హిందూ ఆలయానికి సమీపంలోనే ఉందని ఆ ప్రకటన పేర్కొంది.

ఎపి కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కారుకు ప్రమాదం

- వాణి ప్రసాద్‌కు స్వల్పగాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎపి కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్ కారు ప్రమాదానికి గురైంది. ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని ఆకుపాముల సమీపంలో 65 జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళుతున్నారు. ఈ క్రమంలో ముందు వెళుతున్న శాంట్రో వెహికిల్‌ను ఆ కారు ఢీకొట్టి.. అదుపుతప్పి రోడ్డు పక్కన వరి పొలంలోకి దూసుకుపోయింది. దీంతో ఆమె స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆమెను అంబులెన్స్‌లో సూర్యాపేట ఏరియాస్పత్రికి తరలించారు. ఆ తరువాత ఆమె హైదరాబాద్‌కు వెళ్లినట్టు సమాచారం. ఘటనా స్థలాన్ని కోదాడ ఆర్‌డిఓ సూర్యనారాయణ సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని స్థానిక ఎస్ఐ బి ప్రవీణ్ కుమార్‌ను తెలిపారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) A Government of India Undertaking — సిండికేట్ Syndicate
తాళ్లపాలెం (1361) బ్రాంచ్
తాళ్లపాలెం, కృష్ణా జిల్లా, ఎ.పి.-521002
ఫోన్: 8331015685

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) (ఇక మీదట ''చట్టం''గా రిఫర్‌చేయబడును) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన ...

తేదీ: 02-11-2024, ప్రదేశం: తాళ్లపాలెం — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

Union Bank of India — అసెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

... తేదీ : 01-11-2024 — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

Union Bank of India — అసెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

... తేదీ : 01-11-2024 — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ — IDFC FIRST Bank
(గతంలో ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌గా పేరుగలది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది) | CIN :L65110TN2014PLC097792
రిజిస్టర్డు ఆఫీసు: కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హ్యారింగ్టన్ రోడ్, చెట్‌పేట్, చెన్నై-600031.
Tel : +91 44 4564 4000 I Fax: +91 44 4564 4022

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన

క్ర సం.	రుణ ఖాతా నెం.	రుణం రకం	రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు	సెక్షన్ 13(2) నోటీసు తేది	సెక్షన్ 13(2)నోటీసు ప్రకారం బాకీపడిన మొత్తం
1	10083908001	బిజెల్	1) మాత్రుశ్రీ మెడికల్ కార్పొరేషన్ 2) వెంకట మణి కృష్ణ వంగల 3) వేల్పూరు సాంబశివ శాస్త్రి 4) వెల్లటిన్ సాంబశివ శాస్త్రి	23.10.2024	INR 1,53,67,216.00/-

తేది:05-11-2024, ప్రదేశం: గుంటూరు, ఆంధ్రప్రదేశ్ — సం/- అధీకృత అధికారి, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ — మీ కుటుంబ బ్యాంక్, భారతదేశం అంతటా
అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, ఫస్ట్ ఫ్లోర్, ప్లాట్ నెం.50, శ్రీనగర్ కాలనీ, రోడ్ నెం.3, బంజారాహిల్స్, హైదరాబాద్-500073.
ఫోన్ : 040-23755686/23745686, ఇ-మెయిల్ : hyd.arm@ktkbank.com, వెబ్‌సైట్ : www.karnatakabank.com, CIN : L85110KA1924PLC001128

స్థిరాస్తుల యొక్క అమ్మకపు ప్రకటన

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ - భవానీపురం బ్రాంచ్, ఫోన్: 9581116617
... రిజర్వ్ ధర : రూ.14,40,000/- ... చెల్లించవలసిన బయానా : రూ.1,44,000/-

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ - గవర్నర్‌పేట బ్రాంచి, ఫోన్: 9490743457(BM) / 9030003619(ABM)
... రిజర్వ్ ధర : రూ.56,56,000/- ... చెల్లించవలసిన బయానా : రూ.5,65,600/-

తేది: 02.11.2024, ప్రదేశం: హైదరాబాద్ — సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్

మీకోసం
పట్టుచీరలు ఉతికేటప్పుడు బకెట్‌లో కొంచెం నిమ్మరసం వేయడం వల్ల రంగు పోవు

జీవన సౌరభం
భయపడడం ఎప్పుడు మానేస్తామో.. అప్పుడే మన జీవితం మొదలైనట్లు!

ఎంత చెట్టుకు అంత గాలి

ఆనంద నిలయం అపార్ట్‌మెంట్లో, ఉద్యోగ విరమణ చేసిన తెలుగు మాస్టారు సుందరం ఉన్నారు. సెలవు రోజుల్లో అపార్ట్‌మెంట్ పిల్లలకి కథలు చెప్పడం ఆయన అలవాటు. ఓ సెలవు రోజు పిల్లలంతా మాస్టారు దగ్గరకి వెళ్లారు. మాస్టారు కథ చెప్పడం ప్రారంభించారు.

'పార్వతీపురం అనే గ్రామానికి చాలా దూరం నుండి ఒక బాటసారి వస్తున్నాడు. దార్లో కాస్త సేదతీరుదామంటే అక్కడ నీడనిచ్చే ఒక్క చెట్టు కూడా లేదు. దాహం తీర్చుకుందామంటే బావి కూడా లేదు. చాలా నీరసించిపోయాడు. ఎలాగోలా గ్రామానికి చేరుకుని అక్కడే ఉండిపోయాడు. కొన్ని రోజుల తరువాత గ్రామ పొలిమేరలో ఒక జామ మొక్కను, ఒక వేప మొక్కను నాటాడు. మంచినీళ్ల బావిని కూడా తవ్వించాడు.

కొన్ని సంవత్సరాలకు చెట్లు పెద్దవయ్యాయి. బాటసారులకు నీడనిస్తూ, పండ్లు ఇస్తూ ఉన్నాయి. ఒక రోజు జామ చెట్టు, వేప చెట్టుతో 'నేను అందరికీ చక్కని పండ్లని ఇస్తున్నాను. నీ దగ్గర ఇవ్వడానికి ఏమీ లేదు' అని వెటకారంగా అంది. వేప చెట్టు నవ్వి ఊరుకుంది. బాటసారులు జామపండు తిని, బావిలోని నీటిని తాగి, వేప చెట్టుకింద విశ్రాంతి తీసుకుంటున్నారు. సేదతీరుతూ 'ఆహా!.. ఈ వేప చెట్టు ఎంత చల్లని గాలిని ఇస్తుంది' అని కొందరు, 'అవును ఈ చెట్టు లేకపోతే మనం ఎంతగానో అలసిపోయే వాళ్లం' అని మరి కొందరూ అన్నారు.

బాటసారుల మాటలు ఒక ఉడుత విన్నది. అది వెళ్లి జామ చెట్టుతో 'నీ పండ్లు తింటున్న ప్రతి ఒక్కరూ వేప చెట్టునే మెచ్చుకుంటున్నారు.. ఎందుకంటే నీవు అంతగా గాలిని ఇవ్వలేవు. నీ ఆకులు దళసరిగా ఉంటాయి. వేప చెట్టు మాత్రం అలా కాదు. అది ఇచ్చే గాలి వల్ల ప్రతి కొమ్మ కదులుతుంది. దాని ఆకులు ఆ గాలిని చల్లబరుస్తాయి. అది బాటసారులకు ఎక్కడలేని హాయిని ఇస్తుంది' అని అంది. ఆ మాటల్లో నిజం గ్రహించిన జామచెట్టు, వేప చెట్టు దగ్గరికి వెళ్లి క్షమాపణ అడిగింది.

'పిల్లలూ.. ఇదీ కథ.. ఈ కథకి మీలో ఎవరైనా పేరు పెడతారా? అని మాస్టారు తన చుట్టూ ఉన్న పిల్లలని అడిగారు. 'ఎంత చెట్టుకు అంత గాలి' మాస్టారు అన్నాడు చివర్లో కూర్చొన్న రవి. ఆ సమాధానం విని మాస్టారు, పిల్లలూ ఒకేసారి చప్పట్లు కొట్టారు.

యు.విజయశేఖర రెడ్డి,
99597 36475.

తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో 10 తేడాలు ఉన్నాయి. గుర్తించండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

మోకా సుధీర్,
5వ తరగతి, ఎంపిపి స్కూలు,
కుండలేశ్వరం నం.2,
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చలికాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలు - జాగ్రత్తలు

నవంబర్ నెల వచ్చిందంటే చాలు శీతాకాలం ప్రారంభమై చలి తీవ్రత పెరగటం వల్ల అనేక వ్యాధులు మనపై దాడి చేస్తుంటాయి. ఏ వయస్సు వారైనా ఈ కాలంలో అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి రావటం తెలిసిందే. పల్లెలు, పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా శీతాకాలం వచ్చిందంటే చాలు వ్యాధులు వాటంతట అవే వస్తుంటాయి. ప్రస్తుతం సీజన్ మార్పుతో అనేక రకాల వ్యాధులు విజృంభించస్తుండటంతో బాధితులు నానా అవస్థలు పడుతున్నారు. వాతావరణం చల్లగా ఉంటుండటంతో హానికరమైన వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి హాని కల్గిస్తున్నాయి. ఈ కాలంలో సాధారణంగా జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి, ఫ్లూ వంటి వ్యాధులు సంభవిస్తాయి. వీటితోపాటు పలు రకాల అంటువ్యాధులు, కంటి వ్యాధులే కాకుండా ఎలర్జీలు, ఆస్తమా, అలర్జిక్ బ్రాంకైటిస్, నిమోనియా వంటి శ్వాసకోశ వ్యాధులు కూడా చుట్టుముడుతుంటాయి.

వర్షాకాలం ముగిసిన తర్వాత వచ్చే శీతాకాలంలో కొన్నిసార్లు వాతావరణంలో వచ్చే మార్పులతో గాలి, నీటిలో క్రిమికీటకాల వ్యాప్తి ద్వారా కూడా వ్యాధులు వ్యాపిస్తుంటాయి. అలాంటి వాటిలో ముఖ్యంగా దగ్గు, జలుబు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్లు చలికాలంలో అతిత్వరగా వ్యాప్తి చెందుతుంటాయి. ఇవేకాకుండా మరికొన్ని ఇన్ఫెక్షన్లు పొట్ట, రోగ నిరోధక వ్యవస్థపైనా ప్రభావం చూపుతుంటాయి. వీధుల వెంబడి విక్రయించే కలుషిత ఆహారం తినటం ద్వారానూ, కల్తీ ఆహార పదార్థాలను స్వీకరించటం ద్వారాను వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. వివిధ రకాల కాలుష్యాలు, సూర్యరశ్మి తక్కువగా ఉండటం వల్ల గాలి ద్వారా, వర్షపునీటి ద్వారా వచ్చే దోమల కారణంగా క్రిమికీటకాల నుంచి కూడా రోగాలు వ్యాప్తిచెందుతాయి. ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టినప్పుడు అలసట, నీరసంతో ఇబ్బందులు పడతారు. ఏ పని చేయాలన్నా చురుకుదనం ఉండదు. ఎంతసేపు ఒంటినొప్పులు, ఇతర సమస్యలతో మంచం నుంచి లేవాలని అనిపించదు. పిల్లలు తరచుగా, వృద్ధులు జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఫ్లూ వంటి వ్యాధులతో బాధ పడుతుంటారు. ఈ కాలంలో రాత్రి మొదలు ఉదయం వరకూ విపరీతమైన మంచు కురిసే పరిస్థితులు కూడా ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎముకల్లో నొప్పి, కీళ్ల సమస్యలు బయటేస్తుంటాయి. చలికాలంలో సరిగా దాహం వేయదు. కానీ తగిన మోతాదులో నీటిని సేవించాలి. ఆహారం విషయంలో కూడా వేడి ఆహార పదార్థాలు, తాజాపండ్లు, కూరలు తీసుకోవటం మంచిది. ఒత్తిడికి దూరంగా ఉండటం, క్రమం తప్పకుండా ప్రతిరోజూ వ్యాయామం చేయటం అలవాటుచేసుకోవాలి. మిగతా కాలాలతో పోలిస్తే చలికాలంలో వ్యాధుల తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. సాధారణంగా గొంతునొప్పి, తలనొప్పి, దగ్గు, ఫ్లూ, జ్వరం, జలుబు వంటివి వ్యాప్తి చెందుతాయి.

ముందస్తు జాగ్రత్తలు అవసరం

ఈకాలంలో చల్లటి వాతావరణాన్ని ఆనందిస్తూనే ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలి. మరీ ముఖ్యంగా వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. ఈ కాలంలో కొన్ని అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నప్పటికీ కొన్ని ముందస్తు చర్యలు, జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా తమ ఆరోగ్యాన్ని అదుపులో పెట్టుకోవచ్చు. కీళ్ల నొప్పులతో బాధపడే వారికి ఈ చలికాలం ఆ నొప్పిని మరింత ఎక్కువ చేస్తుంది. శరీరంలోని నొప్పి గ్రాహకాలు మరింత సున్నితంగా మారతాయి. దీనివల్ల కీళ్లలో వాపులు వచ్చి నొప్పి ఎక్కువవుతుంది. చెవి మూసుకుపోవటం, దురదతోపాటు నొప్పి సమస్యలు కూడా ఎక్కువగా వస్తాయి. అధిక చలికారణంగా చెవిలో ఇన్ఫెక్షన్ సమస్యలు ఎదురవుతూవుంటాయి. బీపీ, మధుమేహం ఉన్నవారు ఈ కాలంలో అదనపు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

జ్వరం : శీతాకాలంలో సాధారణంగా ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోతాయి. అందువల్ల వైరస్‌లకు వ్యాప్తిచెందే శక్తి పెరుగుతుంది. విష జ్వరాలు కూడా ఎక్కువగా వస్తుంటాయి. వాతావరణంలో మార్పు కారణంగా చాలామందిలో తరచుగా జ్వరం వస్తుంది. శరీర ఉష్ణోగ్రత 98.6-101 డిగ్రీల ఫారెన్ హీట్ వరకూ ఉంటే దానిని సాధారణ జ్వరంగానే పరిగణించొచ్చు.

ఆస్తమా (ఉబ్బసం) : ఆస్తమాతో బాధపడేవారు కూడా చాలా జాగ్రత్తగా ఉండాలి. గొంతునొప్పి, కఫం, ఛాతీ బిగుతుటా మారి శ్వాస ఆడకపోవటానికి కారణమవుతుంది. ఇది ఉబ్బసానికి కూడా దారితీస్తుంది.

న్యూమోనియా : ఊపిరితిత్తులకు కలిగే వ్యాధే న్యూమోనియా. ఈ వ్యాధి వైరస్, బ్యాక్టీరియా, క్షయవాధి వల్ల వ్యాప్తిచెందుతుంది. పొగతాగడం, చలిగాలిలో తిరగడం, కుటుంబ పరంగా అస్తమా, అనారోగ్య పరిస్థితుల వల్ల ఈ వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రెండేళ్లలోపు చిన్నారుల్లోనూ, 65 ఏళ్లు పైబడిన వారిలో ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ.

ఫ్లూ : చాలామందిని ఇబ్బంది పెడుతుంది. రోగ నిరోధక శక్తి బలహీనంగా ఉన్న వారికి ఫ్లూ వ్యాధి ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధిగ్రస్తులు తరచుగా ముక్కు, కళ్ళు, చెవులను తాకటాన్ని మానుకోవాలి.

జలుబు : సీజన్ మారే క్రమంలో చాలామందికి గొంతునొప్పి తరువాత దగ్గు, జలుబు వస్తాయి. శీతాకాలంలో చిన్న పిల్లలు, పెద్దవారు అనే తేడా లేకుండా వచ్చే సీజనల్ జలుబు, దగ్గుతో ఇబ్బందిపడుతుంటారు. వాతావరణంలో మార్పులు, తాగేనీటిలో మార్పులతో కూడా పిల్లల్లో జలుబు లక్షణాలు పెరుగుతాయి.

చర్మవ్యాధులు : చర్మవ్యాధులైన సోరియాసిస్, దురద లాంటివి ఎక్కువగా వస్తాయి. ముఖంపై మొటిమలు, కాళ్ల పగుళ్లు, చర్మంపై మచ్చలు పడటం వంటి ఇబ్బందులు ఉంటాయి. పలు రకాల ఫంగస్ ఇన్ఫెక్షన్లు కూడా సోకుతాయి. దీనిని నివారించటానికి శరీరాన్ని ఎప్పుడూ తేమగా ఉంచుకోవాలి.

గొంతునొప్పి : చలికాలంలో చాలామందిని ఇబ్బంది పెట్టే ప్రధాన సమస్యల్లో గొంతునొప్పి ఒకటి. సీజన్ మారే సమయంలో చాలామందికి ముందుగా గొంతునొప్పి వస్తుంది. గొంతులో ఇన్‌ఫెక్షన్ కారక సూక్ష్మక్రిములు చేరటం వల్ల ఈ నొప్పి మొదలవుతుంది. దానివల్ల సరిగ్గా మాట్లాడలేకపోవటం, గొంతులో గరుకుగా ఉండటం వంటి ఇబ్బందులు వస్తాయి.

ఆహార పదార్థాలు కల్తీ : ఈ కాలంలో ఆహార పదార్థాలు బాగా కలుషితం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కలుషిత ఆహారం తిన్నప్పుడు, నీటిని తాగినప్పుడు కడుపులో నొప్పి, వికారం కలుగుతుంది. వాంతులు అవుతుంటాయి. శరీరంలో బలహీనంగా అనిపించటం మొదలవుతుంది.

కడుపులో నొప్పి : జీర్ణక్రియ బలహీనంగా ఉండటం వల్ల కడుపునొప్పి సాధారణంగానే వస్తుంది. విరేచనాలు, వాంతులు ఈ సీజనల్‌లో తరచుగా వస్తుంటాయి. తినే ఆహారం, తాగే పానీయాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం.

పాదాల పగుళ్లు : చాలామందికి పాదాల పగుళ్ల సమస్య ఎదురవుతుంది. దీనివల్ల పాదాలు నొప్పిగా ఉండటం, నడవడం ఇబ్బందిగా ఉంటుంది. పాదాలు అందవికారంగా తయారవుతాయి. కాళ్లు పొడిబారుతాయి. ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగిసే మడమల దగ్గర చర్మానికి పగుళ్లు వస్తాయి.



హిందీని బలవంతంగా రుద్దొద్దు

- జీరో అవర్ నోటీసుకు హిందీలో కేంద్ర మంత్రి సమాధానాన్ని నిరసిస్తూ మలయాళంలో ప్రత్యుత్తరం
- సిపిఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ నిరసన
- సంప్రదాయాలను గౌరవించాలని హితవు

న్యూఢిల్లీ : ఈ ఏడాది పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో తాను చేసిన ప్రత్యేక ప్రస్తావనలు, లేవనెత్తిన జీరో-అవర్ నోటీసుకు సమాధానంగా కేంద్ర మంత్రి రవ్‌నీత్ బిట్టూ హిందీలో లేఖ రాయడాన్ని సిపిఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ తప్పుపట్టారు. కేంద్ర మంత్రి చర్యను నిరసిస్తూ ఆయనకు మలయాళంలో ప్రత్యుత్తరం ఇచ్చారు. కేంద్ర మంత్రులు దక్షిణాది రాష్ట్రాల ఎంపీలకు ఆంగ్లంలో లేఖలు రాయడం సంప్రదాయంగా వస్తోంది. తాజాగా కేంద్ర మంత్రి రవ్‌నీత్ బిట్టూ దానికి విరుద్ధంగా పూర్తిగా హిందీలో లేఖ రాశారు. దీంతో నేను ఆయనకు మలయాళంలో జవాబు ఇవ్వాల్సి వచ్చింది' అని బ్రిట్టాస్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. రైల్వేలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖల సహాయ మంత్రి రవ్‌నీత్ తనకు హిందీలో రాసిన లేఖలను కూడా ఆ పోస్ట్‌తో పాటు షేర్ చేశారు. 'ఈ ఏడాది పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో నేను చేసిన ప్రత్యేక ప్రస్తావనలు, లేవనెత్తిన జీరో-అవర్ నోటీసుకు సమాధానంగా రవ్‌నీత్ లేఖలు రాశారు. పదేపదే హిందీలో మాత్రమే సమాధానాలు పంపడాన్ని చూస్తుంటే అది ఉద్దేశపూర్వక విధానంగా కనిపిస్తోంది' అని బ్రిట్టాస్ తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలలో హిందీ అధికార భాష కాదని, పైగా దానిని విస్తృతంగా మాట్లాడరని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తన అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలలోనూ, పార్లమెంటులోనూ హిందీతో పాటు ఆంగ్ల భాషను కూడా ఉపయోగించేందుకు 1963వ సంవత్సరపు అధికార భాషల చట్టం అనుమతిస్తోంది. హిందీ మాట్లాడని రాష్ట్రాలతో సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవడానికి ఆంగ్ల భాషను ఉపయోగించవచ్చునని ఆ చట్టం చెబుతోంది. వివిధ అధికారిక పత్రాలు, నివేదికల కోసం ఈ రెండు భాషలూ వాడవచ్చునని తెలిపింది. చట్టంలోని ఈ నిబంధనల ప్రాధాన్యతను తక్కువ చేయకూడదని బ్రిట్టాస్ తన లేఖలో తెలియజేశారు.

కేవలం హిందీలో మాత్రమే సమాధానాలు ఇచ్చే ధోరణిని చూస్తుంటే చట్టబద్ధమైన భాషా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు అర్థమవుతోందని బ్రిట్టాస్ విమర్శించారు. హిందీయేతర భాషలు మాట్లాడే ఎంపీలు తమ పార్లమెంటరీ కార్యకలాపాలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు, ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకునేందుకు ప్రభుత్వ వైఖరి అడ్డంకిగా మారిందని చెప్పారు. గతంలో కేంద్ర ప్రభుత్వాలు హిందీయేతర భాషలు మాట్లాడే రాష్ట్రాల ప్రతినిధులతో ఆంగ్లంలోనే సమాచారాన్ని పంచుకునేవని ఆయన గుర్తు చేశారు. 'చారిత్రకంగా కేంద్ర ప్రభుత్వాలు చట్టపరమైన కర్తవ్యాలను, సంప్రదాయాలను పాటిస్తూ భాషకు సంబంధించిన నిబంధనలను గౌరవించాయి. హిందీయేతర భాషలు మాట్లాడే ఎంపీలకు ఆంగ్లంలోనే సమాచారాన్ని పంపేవి. ఈ పద్ధతికి ఇటీవల స్వస్తి చెప్పినట్లు కన్పిస్తోంది. దీనిని వెంటనే సరిచేయాలి' అని కోరారు. కేంద్రంలోని అధికార బిజెపి ప్రభుత్వం బలవంతంగా హిందీ భాషను రుద్దేందుకు చేస్తున్న ప్రయత్నాలపై గతంలో వామపక్షాలు, డిఎంకె సహా వివిధ పార్టీలు, హిందీ మాట్లాడని రాష్ట్రాల నేతలు పలు సందర్భాలలో నిరసన వ్యక్తం చేశారు.

ముడా కుంభకోణం కేసులో సిద్దరామయ్యకు సమన్లు

- 6న హాజరుకావాలని ఆదేశం
- హాజరవుతానన్న కర్ణాటక సిఎం

బెంగళూరు: మైసూర్ అర్బన్ భూ కేటాయింపుల కేసు (ముడా)లో విచారణ నిమిత్తం తన ఎదుట నవంబరు6న హాజరుకావాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు లోకాయుక్త సోమవారం సమన్లు జారీ చేసింది. లోకాయుక్త నోటీసు తనకు అందిందని, అందులో కోరినట్టుగానే తాను బుధవారం లోకాయుక్త ఎదుట విచారణకు హాజరవుతానని సిద్ధరామయ్య ఇక్కడ విలేకరులతో అన్నారు. ఆర్‌టిఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదుపై ముఖ్యమంత్రి సిద్ద రామయ్యను విచారించేందుకు గవర్నరు అనుమతి ఇవ్వడం, దానిని ఆయన కోర్టులో సవాల్ చేయడం, కోర్టు విచారణ జరపాల్సిందేనని చెప్పడంతో లోకాయుక్త ఈ దర్యాప్తును చేపట్టింది. సిద్ద రామయ్యను, ఆయన భార్య, బామ్మర్ది మల్లికార్జున స్వామి, దేవరాజు తదితరుల పేర్లను పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. స్వామి ఆ భూమిని కొనుగోలు చేసి సిద్ధరామయ్య భార్య పార్వతికి కానుకగా ఇచ్చారనేది వారిపై మోపిన ప్రధాన అభియోగం. తనపై విచారణకు గవర్నరు ఇచ్చిన అనుమతిని సమర్థిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై సిద్ధరామయ్య డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేశారు. ఇదిలా వుండగా పార్వతి ముడా పరిధిలో తనకు కేటాయించిన 14 స్థలాలను తిరిగి వెనక్కి ఇస్తున్నట్లు ఇటీవల ప్రకటించారు.

స్టేడియంల సుందరీకరణపై కసరత్తు

- త్వరలో గోల్ఫ్‌కోర్స్ : ఎంపి కేశినేని

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్, ఇబ్రహీంపట్నం

ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్ స్టేడియంల సుందీరకరణ, ఐపిఎల్ తరహాలో ఎపిఎల్ (ఆంధ్ర ప్రీమియర్ లీగ్) నిర్వహిస్తామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, విజయ వాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఇందుకుగాను ఎసిఎ ఆధ్వర్యాన 175 నియోజకవర్గాల్లో క్రికెట్ గ్రౌండ్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్, క్రికెట్ అకాడమీలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని డాక్టర్ గోకరాజు లైలా గంగరాజు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. స్టేడియంలో మౌలిక వసతుల కల్పన, సుందరీకరణపై అధికారులు, స్టేడియం నిర్వాహకులు, సిబ్బందితో చర్చిం చారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రాజధాని ప్రాంతం మంగళగిరితోపాటు, మూలపాడులో ఉన్న ఎసిఎ క్రికెట్ స్టేడియాలను ఏడాదిలోగా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసువస్తామని, స్టేడియానికి వచ్చే మూడు రహదారుల అభివృద్ధికి ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. మూల పాడుకు గోల్ఫ్‌కోర్స్ రాబోతోందని, దీని ద్వారా 400 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎసిఎ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, అడ్మిన్ మేనేజర్ జి.శ్రీనివాసరావు, కెడిసిఎ సెక్రటరీ ఎం.రవీంద్ర చౌదరి, జాయింట్ సెక్రటరీ రజనీకాంత్ పాల్గొన్నారు.

క్రికెట్‌కు వృద్ధిమాన్ సాహా గుడ్‌బై

కోల్‌కతా: బెంగాల్ క్రికెటర్, భారతజట్టు వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా అన్ని రకాల క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. సోషల్ మీడియా వేదికగా సోమవారం రిటైర్‌మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. క్రికెట్‌లో అద్భుతమైన ప్రయాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు అని పేర్కొన్నాడు. బెంగాల్ తరఫున ఈ సీజన్‌లో ఆడుతున్న రంజీట్రోఫీ చివరిదంటూ.. బెంగాల్‌కు ప్రాతినిథ్యం వహించడం గౌరవంగా ఉందని 37ఏళ్ల సాహా తెలిపాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో సాహా 40 టెస్టుల్లో 29.41 సగటుతో 1,353 పరుగులు చేశాడు. అందులో మూడు సెంచరీలు ఉన్నాయి. తొమ్మిది వన్డేల్లో 13.67 సగటుతో 41 పరుగులు చేశాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో బెంగాల్‌కు 15ఏళ్లు ప్రాతినిథ్యం వహించాడు. ఎంఎస్ ధోనీ రిటైర్‌మెంట్ అనంతరం కీపర్‌గా సేవలందించాడు. ధోని, రిషబ్ పంత్‌లతో కలిసి టీమిండియా కీపింగ్ బాధ్యతలు నిర్వర్తించాడు. చివరిసారిగా సాహా 2021లో న్యూజిలాండ్‌తో టెస్టు మ్యాచ్ ఆడాడు. హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ శర్మ, టీమ్ మేనేజ్‌మెంట్ పంత్‌కి బ్యాకప్‌గా ఆంధ్ర క్రికెటర్ శ్రీకర్ భరత్‌ను తీసుకోవాలని నిర్ణయించింది. ఐపీఎల్‌లో 2008 అరంగేట్రం చేసిన సాహా.. గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, సన్ రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ఐపిఎల్‌లో 170 మ్యాచుల్లో 127.57 స్ట్రయిక్ రేట్‌తో 2,934 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 13 అర్ధ సెంచరీలు ఉన్నాయి.

కేరళ జర్నలిస్టు సిద్ధిఖీ కప్పన్‌కు ఊరట

- యుపి పోలీస్‌స్టేషన్‌కు ప్రతి వారం వెళ్లనక్కర్లేదన్న సుప్రీం

న్యూఢిల్లీ : కేరళ జర్నలిస్టు సిద్ధిఖీ కప్పన్‌కు సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. ఉత్తరప్రదేశ్‌లోని పోలీస్‌స్టేషన్‌కు ప్రతి సోమవారం కప్పన్ హాజరై రిపోర్టు చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. గతంలో ఇచ్చిన బెయిల్ షరతులను సుప్రీంకోర్టు తాజాగా సవరించింది. ఈ మేరకు జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. బెయిల్ షరతుల్లో ఉపశమనం కలిగించాలని సిద్ధికి కప్పన్ కోరారు. దీనిని విచారించిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. యుపిలోని హత్రాస్‌లో జరిగిన దారుణ హత్యాచార ఘటనను రిపోర్ట్ చేయడానికి వెళుతున్న సిద్ధిఖీ కప్పన్‌ను 2020 అక్టోబర్‌లో ఆ రాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. హత్రాస్‌లో కుట్రకు పాల్పడుతున్నాడంటూ అసత్య ఆరోపణలతో అదుపులోకి తీసుకుని ఉపా చట్టం కింద అక్రమ కేసు బనాయించింది. 'హత్రాస్ కేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తన వైఫల్యాన్ని దాచుకోవడానికి తనను జైల్లో పెట్టిందని కప్పన్ వ్యాఖ్యానించారు.

పవన్ వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు : అనిత

ప్రజాశక్తి- అనంతపురం

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను కొందరు కావాలనే వక్రీకరిస్తున్నారని అన్నారు. సోమవారం రాత్రి అనంతపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో పవన్ కల్యాణ్ తనను హెచ్చరిస్తూ మాట్లాడారంటూ కొందరు సోషల్ మీడియాలో కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన చేసిన వ్యాఖ్యలను తాను సానుకూలంగా స్వీకరిస్తున్నానన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, తాను సమిష్టి ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. కొందరు సోషల్ మీడియాలో కావాలనే అసత్యాలను ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలపై కఠినంగా వ్యవహరించాలని ఇప్పటికే పోలీసులకు సూచించామన్నారు.

మోడీ నా ఇంటిని సందర్శించడంలో తప్పు లేదు : : సిజెఐ

న్యూఢిల్లీ : గణపతి పూజ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన ఇంటిని సందర్శించడంలో ఎలాంటి తప్పు లేదని భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ సోమవారం పేర్కొన్నారు. ఇలాంటి విషయాల్లో 'రాజకీయ రంగంలో పరిపక్వత' అవసరమని అన్నారు. ఒక మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'గణపతి పూజ కోసం ప్రధానమంత్రి నా నివాసాన్ని సందర్శించారు. న్యాయవ్యవస్థ, కార్య నిర్వాహక వ్యవస్థ మధ్య సమావేశాలు కొనసాగుతున్నందు వలన ఇందులో ఎలాంటి తప్పు లేదు. రాష్ట్రపతి భవన్, రిపబ్లిక్ డే వంటి సంఘటనల్లో మేం కలుస్తుంటాం. ప్రధానమంత్రి, ఇతర మంత్రులతో సంభాషిస్తుంటాం. వ్యక్తిగతం, సమాజంలో సాధారణ సమస్యలు గురించి మేం చర్చిస్తుంటాం' అని సిజెఐ తెలిపారు. అలాగే, అయోధ్య రామమందిర వివాదానికి పరిష్కారం కోసం దేవుడ్ని ప్రార్థిస్తున్నట్లు తాను చేసిన వ్యాఖ్యలను కూడా చంద్రచూడ్ ఈ సందర్భంగా సమర్థించుకున్నారు. తాను 'విశ్వాసం కలిగిన వ్యక్తిని' అని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తానని తెలిపారు.

ప్రొఫెసర్ రోమిలా థాపర్‌కు పిజి అవార్డు ప్రదానం

తిరువనంతపురం : నాలుగవ పిజి నేషనల్ అవార్డును ప్రముఖ చరిత్రకారులు, రచయిత ప్రొఫెసర్ రోమిలా థాపర్‌కు సోమవారం ప్రదానం చేశారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేతులు మీదుగా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. రచనా రంగంలోనూ లేదా సామాజిక కార్యక్రమాల్లో సేవలు అందించిన వారికి తిరువనంతపురంలోని పిజి సాంస్కృతిక కేంద్రం ఈ అవార్డును అందజేస్తోంది. ఈ అవార్డుతో పాటు రూ. 3 లక్షల నగదు కూడా అందజేస్తారు. ఇప్పటి వరకూ ఈ అవార్డును ప్రశాంత్ భూషణ్, ఎన్ రామ్, అరుంధతి రాయ్ అందుకున్నారు.

ఓటుకు నోటు కేసులో విచారణ నుంచి తప్పకున్న జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ

- మరో ధర్మాసనానికి కేసు విచారణ బదిలీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఓటుకు నోటు కేసును విచారిస్తోన్న సుప్రీంకోర్టు ధర్మాసనం నుంచి జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ తప్పుకున్నారు. ఈ కేసు నుంచి తనను తప్పించాలని జెరూసలేం ముత్తయ్య రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న తెలంగాణ హైకోర్టు కేసు నుంచి జెరూసలేం ముత్తయ్య పేరును క్వాష్ (తొలగించడం) చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ తీర్పును సవాల్ చేస్తూ 2016 జులై 6న తెలంగాణ స్టేట్ యాంటీ కరెప్షన్ బ్యూరో (ఎసిబి) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. అయితే.. తాను గతంలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశానని జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ తెలిపారు. అందువల్ల ఈ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు (నాట్ బిఫోర్ మీ) వెల్లడించారు. ఈ నేపథ్యంలో మరో ధర్మాసనం ఎదుట కేసు విచారణ జరుగుతుందని ధర్మాసనం తెలిపింది.

జార్ఖండ్ ప్రభుత్వ పిటిషన్‌పై విచారణకు సుప్రీం అంగీకారం

- వలసలు, చొరబాట్లపై జార్ఖండ్ హైకోర్టు ఆదేశాలు సవాల్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ నుండి రాష్ట్రంలోకి అక్రమంగా వలసలు జరుగుతున్నాయన్న ఆరోపణలను పరిశీలించేందుకు నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేయాలంటూ జార్ఖండ్ హైకోర్టు జారీ చేసిన తాత్కాలిక ఆదేశాలపై రాష్ట్రప్రభుత్వం వేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. సెప్టెంబరులో హైకోర్టు జారీ చేసిన ఆదేశాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అఫిడవిట్ ఆధారంగా ఇచ్చినవి. చొరబాట్లు జరిగినట్లు అంచనా వేయబడిందని ఆ అఫిడవిట్ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవాలు చేసింది. ఆ నిర్ధారణకు తగినట్లుగా డేటా లేదని పేర్కొంది. దీనిపై శుక్రవారం విచారణ జరిపేందుకు జస్టిస్ సుధాంశు దూలియా, జస్టిస్ అహసనుద్దీన్ అమనుల్లాలతో కూడిన బెంచ్ నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీల్ తీవ్రమైనదని, ఫైళ్ళన్నింటినీ జాగ్రత్తగా సరిచూసుకోవడానికి బెంచ్‌కు కొంత సమయం అవసరమని జస్టిస్ దూలియా వ్యాఖ్యానించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68